# మూగ భార్య

**అం**బరీషూ, భరద్వాజా చిన్నతనం నుండి వొకర్నొకరు బాగా ఎరుగుదురు; బి.ఎ. వరకూ క్లాసుమేట్సు కూడా !

ఎక్కువగా వాళ్ళ భావాలు ఏకీభవించేవి. అప్పుడప్పుడు అని సమానాంతరంగానూ, విముఖముగానూ పోయిన సందర్భాలు కూడా లేకపోలేదు. ఐనా అవన్నీ వ్యక్తిగతాభిప్రాయాలుగా భావించుకుని, తమ మిత్రత్వాన్ని యథాప్రకారంగా కొనసాగించేవారు.

వాళ్ళ చర్చల్లో రాజకీయాలూ, ప్రణయ విషయాలూ కూడా దొర్లేవి. ఇద్దరూ నూతనంగా జీవితాన్నన్వేషించే ఉద్రేకం గల నవయవ్వనులైన మూలాన చర్చలకూ, ఊహాగానాలకూ అంతుండేది కాదు.

"కమింగ్-విత్-ఫాదర్-మీట్-స్టేషన్

అంబరీష్"

అని ఉన్న టెలిగ్రాంను చదువుకున్న భరద్వాజను పాత జ్ఞాపకాలన్నీ కలవరపర్చ సాగాయి. అతన్ని చూసి ఐదేళ్లవుతోంది. ఈలోపల తను పెళ్ళి చేసుకుని గృహస్థుడయ్యాడు. అంబరీషుకు పెళ్ళయినట్లే లేదు. అప్పుడప్పుడు ఉత్తరాలు మాత్రం వొచ్చేవి.

ఎన్నో రకాల ఉద్యోగాలు మారి. ఆఖరుకు సికిందరాబాద్‌లో ఏదో వ్యాపారం మొదలెట్టి, చాలా అభివృద్ధి చెందినట్టు మాత్రం తెల్సు.

తనో? ఒక మిడిల్ స్కూలులో ఉపాధ్యాయ వృత్తి వెలుగిస్తూ బ్రతుకుతున్నాడు.

అతనికి "బతకలేక బడి పంతులు" అనే సామెత గుర్తుకొచ్చింది. కాని దాని అర్థం పూర్వం తెలియలేదు. ఇప్పుడు గోచరమవుతోంది: "బతక నేర్చిన వాడు అంటే కుళ్ళూ, కుత్సిమం, మోసం, బొంకులాడడం, సొంతలాభం, ఎరిగినవాడని అర్థం. అది లేనివాడు బతకలేనివాడు- అంటే ఉపాధ్యాయులు సూటిగా బతికేవారని అర్థం." ఇది తోచేటప్పటికి అతని కెంతో గర్వము కలిగింది! తను తక్కువ జీతంతో బాధపడుతున్న అవస్థకూడా మర్చినట్టు మొహంపెట్టాడు.

'ఏమిటండీ టెలిగ్రాం" అందతని భార్య. అతని చేతిలోని గులాబీ రంగు కాగితాన్ని చూసి. కాఫీ అందించింది.

"నా స్నేహితుడెవరో వొస్తున్నాడు. రెండు రోజులు మనతోనే వుంటాడు."

"ఏడ్చినట్టే వుంది, మింగ మెతుకులేదు, మీసాలకు సంపెంగ నూనన్నట్టు ఈ సంత కూడా ఎందుకూ?" దీర్ఘం తీసింది.

అతని ముఖం కందిపోయింది.

"అదేమిటి ప్రభా! నీకేం లోటు చేశానని, ఆకోపం?" అన్నాడు. ప్రభావతి ముఖం చిట్లించింది. "ఆ! లోటేమీలేదు. నేను చావక పోవడం తప్పు!" నిష్ఠురంగా అంది.

"మీ నాన్న ప్లీడరుగా వందలు గడించాడని, అందర్నీ అలా తెమ్మంటే ఎలా?"

"ఇంత పెళ్లానికి తేలేని వాళ్లు పెళ్లే చేసుకోకూడదు"

"మన గోల కేంగాని, ఈ రెన్నాళ్లూ కొంచెం పరువు దక్కించు."

"గానుగెద్దు చాకిరీ ఎప్పుడూ ఉండేదేగా" అంటూ విసురుగా వెళ్ళిపోయింది. అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

మరుక్షణంలోనే మిత్రుడు దృష్టి పథంలో కదిలాడు. అతనికీ, తనకూ ఓ రోజున జరిగిన సంభాషణ స్మృతిపథంలో మెరసింది: "ఎటువంటి స్త్రీలను పెళ్లి చేసుకోవాలి?" అని.

"నోరుండి చదువుకున్న ఆడదాన్ని పెళ్లి చేసుకునేకన్నా నోరు లేని పల్లెటూరి నిరక్షరాస్యురాల్ని పెళ్లి చేసుకోవడం మంచిది" అని తను అన్నాడు.

అంబరీషుడు దాన్ని ఖండించి, "చేసుకుంటే చదువుకున్న వాళ్లనే చేసుకోవాలి; వాళ్లే కొంత వాదన ద్వారా సామరస్యానికి వొస్తారు. చదువు లేనివాళ్ళు మరీ పశువుల్లా ప్రవర్తిస్తారు. వాళ్ళ దగ్గర ఆర్గ్యుమెంట్సు పనికిరావు-చెవిటివాడి ముందు శంఖంలా" అని అన్నాడు.

కాని ఇద్దరూ ఒక అభిప్రాయానికి రాలేకపోయారు. ఇది జరిగిన రెండు సంవత్సరాలకే తనకు ప్రభావతితో పెళ్ళైంది. "అమ్మాయి ఇంటర్‌మీడియెట్ చదివింది. తండ్రి ప్లీడరు; నాలుగు వేలు కట్నమిస్తానన్నారింకేం?" అనే ఊహతో తండ్రి ఏర్పర్చిన పెళ్ళిని తను ఎదుర్కోలేకపోయాడు- నిజంగా అంబరీషు భావాలే నిజమైతే తన జీవితం సుఖప్రదం కాదా? అనుకున్నాడు.

కాని ప్లేటు మారింది. తన భయమే నిజమైంది. తన భార్య చదువొచ్చిన బ్రహ్మరాక్షసి! ఏమన్నా మీద పడుతుంది; పరువుకోసం మూసుకుని వున్న నోరుని బట్టి చాతకానివాణ్ణిగా జమకట్టి, అతన్ని ప్రతి విషయంలోనూ రచ్చ కీడ్వసాగింది. ఆవిడ నోరుకి భయపడి "విషం తాగుదామా?" అని అతను అనుకోని క్షణాలు లేవు.

రాత్రి స్టేషన్కు వెళ్ళాడు. బండి లేటు. అది వొచ్చేటప్పటికి అతనికి ఒక అర్ధ రూపాయి ఖర్చయింది–కాఫీకీ, సిగరెట్లకీ.

అది వృథా ఖర్చు అని తెల్సు. కాని నిరీక్షించడం కష్టమై ఆ విధంగా ఖర్చు చేసేడు. అతనికి ఆ ఎనిమిదణాలఖర్చు అనవసరమని తోచగానే, ఈ రైళ్ళ అనవసర ఆలస్యాల మూలంగా– అందులోనూ గంటల తరబడి– ప్రజాద్రవ్యం, ఎన్ని వేల రూపాయలు వృథా అవుతోందో? అనే ఆలోచన కలిగింది.

చివరికి రైలు వొచ్చింది. అంబరీషుని కష్టపడి పోల్చాడు. మిత్రులు ఎంతో ఆనందించారు, చిరకాల దర్శనానికి.

ఒక జట్కా మాట్లాడి ఇంటికి బయలుదేరారు.

వాళ్ళు పెళ్ళి సంబంధాన్ని చూడ్డానికి వొచ్చేరనేటప్పటికి, అతనికి మరీ ఆనందం కలిగింది.

ఆఖరికి తన మిత్రుడు కూడా వివాహితుడు కాబోతున్నాడు. అంత కన్న తనకు కావల్సిందేముంది?

రాత్రి భోజనాలనంతరం మిత్రులిద్దరూ ఎంతో సేపు మాట్లాడుకున్నారు తనవి తారా! అంబరీషు తండ్రి పరశురామయ్య అలసిపోయిన మూలాన త్వరగానే నిద్రపోయారు.

## 2

పడక కుర్చీల మీద అంబరీషూ, పరశురామయ్యా, పెళ్ళి కూతురు తండ్రి వెంకన్న పంతులూ కూచున్నారు. ఎదురుగా తివాసీ పర్చివుంది. దానిమీద వీణ పెట్టబడివుంది. వీధిలోంచి వొస్తున్న కాంతి కిరణాలు దాని ఫ్రెంచి పాలిష్మీద పడి వింతగా ప్రతిఫలిస్తున్నాయి. గోడమీద గడియారం పెళ్ళికొడుకు హృదయచలనంతో సానుభూతి చూపుతున్నట్టుగా "టిక్, టిక్" మని ధ్వని చేస్తూ, నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తోంది.

అది వెంకన్న పంతులు గారింట్లో డ్రాయింగ్ రూం. గోడలపైన వివిధ నాయకుల ఫోటోలు ఫ్రేములు కట్టబడి వున్నాయి. ఓ మూల ఎత్తైన స్టాండ్ మీద ఫ్లవర్వేస్లో వివిధ రకాల పూవులూ, క్రోటన్ ఆకులూ అమర్చబడివున్నాయి. మరో ప్రక్కగా చిన్న టేబిల్మీద హీజ్ మాస్టర్స్ వాయిస్ రేడియో సెట్టు కనులకింపుగా, పెద్దగా, కన్పడుతోంది. ఆ ఆధునిక వాతావరణమంతా తండ్రీ, కొడుకులను సంతృప్తి పర్చినట్టుగా వాళ్ళ ముఖాలే వ్యక్తీకరిస్తున్నాయి.

కొన్ని క్షణాల నిశ్శబ్దానంతరం వెంకన్న పంతులే, "రా, అమ్మా! వొచ్చి కూచో మధూ" అన్నాడు.

"మధూ!" పేరెంత మధురంగా వుంది! పూర్తి పేరేమిటో? ఆ పేరును వింటుంటే ఆ అమ్మాయి కూడా మధురంగానే వుండి వుండాల్సి వుంటుందనిపించింది అంబరీషుకు.

మధ్యగదికి కట్టిన వాయిల్ తెరని తొలిగించుకొని పదహారేళ్ళ సౌందర్యవతి, అపర అప్సరసలా, అడుగులో అడుగేసుకొంటో వొచ్చింది, లోపల నుండి.

అనుమానిస్తున్న కూతురికి ప్రోత్సాహ మిస్తున్నట్టుగా మధ్య వయస్సులో నున్న గాజుల చేతులు ఆమెని సాగనంపుతున్నాయి. మందగమనంతో ఆ అమ్మాయి తివాసీని సమీపించి, ఆసీనురాలైంది. సాగనంపిన చేతులు తెర వెనక అదృశ్య మయ్యాయి–వెంటనే.

ముఖ్యం గుండ్రంగా చాలా అందంగా వుంది. నుదిటిపైన కోలగా పెట్టుకున్న ఎర్రటి తిలకం సువర్ణచ్ఛాయ గల శరీరం మీద వింతగా మెరుస్తోంది. జుట్టు పాపిటకిరువైపుల దువ్వబడి, నొక్కులు నొక్కులుగా వుండి, దానిమీద పడుతున్న కాంతిలో కెరటాలుగా కనపడుతోంది. తిలకంతో పోటీ చేస్తున్న ఎర్రటి పెదిమలూ, జుట్టు చాటునుండి మెరుస్తున్న రవ్వల దుద్దులూ, దుద్దులతో పోటీ చేస్తున్నట్టుగా రవ్వల్లా మెరిసే కళ్ళూ, మెడలోని చంద్రాల హారం ఆ అమ్మాయి అందాన్ని ఎన్నో రెట్లు ఎక్కువ చేస్తున్నాయి. తెల్ల సిల్కు జాకెట్టూ, గులాబీ రంగు సిల్కు చీరా ఆమె దుస్తులు.

కాబోయే పెళ్ళికొడుకూ, తండ్రీ ఒక క్షణం నివ్వెరబోయి, తాము వొచ్చిన పనిని గుర్తుకు తెచ్చుకుని, నెమ్మదిగా తేరుకున్నారు, కొన్ని క్షణాల్లో.

ఇదంతా గమనించిన వెంకన్న పంతులు "అమ్మాయి అందంగానే వుంది!" అన్నవాళ్ల ఆలోచనల్ని వాళ్ల మొహాలమీదే చదువుతున్నా, ఏమీ ఆనందం పొందలేదు. గమనించినట్టు కనబడనూలేదు. ఎందుకో? ఆయన మొహంలో, కళ్ళ వెనకాల ఏదో అగాధం, స్ఫురించని బాధ అవ్యక్తంగా గోచరిస్తోంది–ఆయన, దాన్ని దాచుకోడానికి అష్ట కష్టాలు పడి ప్రయత్నిస్తున్నా.

"అమ్మాయి, ఏం చదువుకుంది?"

"ఎనిమిది ప్యాసైంది"

"ఇంక చదివించలేదేం?"

"ఆడవాళ్ళకు అంతకంటె చదువు అవసరమనిపించలేదు. అదీగాక పెద్ద చదువులు చదువుకోవడం మా సాంప్రదాయానికి విరుద్ధం. అందుకని..."

"అమ్మాయి పేరు?"

"మధుర భాషిణి!"

అంబరీషు మొహంలో ఆనందం రెట్టింపయింది.

మధురభాషిణి కనుకొలు కుల్లోంచి అంబరీషుని చూడాలని యత్నించింది–సిగ్గుతో తలొంచుకునే. కాని అతనూ ఆ అమ్మాయివైపే తీక్షణంగా చూస్తున్నమూలాన ఇద్దరి దృక్కులూ కలిశాయి. ఏవో టెలిగ్రాపు మౌన భాషలు నడిచాయి.

మధుభాషిణి తిరిగి తలవొంచుకుంది. వెంకన్న పంతులు ఏదో ప్రళయం

రాబోతున్నట్టుగా అంతకంతకు నిర్విణ్ణుడై పోతున్నాడు. తెర వెనకనుండి ఆడవాళ్ళ గుసగుసలు వినపడుతోనే వున్నాయి యేవేవో.

అంబరీషు, "ఏదైన ఒక పాట పాడమనండి!" అన్నాడు ప్రేమ వీక్షణాల్ని ప్రసరిస్తోనే.

మధురభాషిణి వీణ తీసుకుని, శృతిసరిచేసి, "రామ నీదు సమాన మెవరురా?" అనే కీర్తనను వీణమీద మీటింది. దివ్యంగా వుంది వీణా వాయిద్య ప్రావీణ్యత.

"ఇన్‌స్ట్రుమెంటు ఉపయోగించడమే గాని స్వయంగా పాడ్డం రాదా ?" అన్నాడు అంబరీషు మందహాసం చేస్తూ. మధురభాషిణి కోరచూపు చూసి తలొంచుకుంది. ఆ చూపులోని నిగూఢార్థం బ్రహ్మకైనా తెలీదు; అలా చూసింది.

వెంకన్న పంతులు మొహంమీద ఏర్పడ్డ విషాదరేఖలు ముసలితనపు ముడతల్లో ఐక్యమైపోయాయి. వాళ్ళ మొహాలు దాచబడుతున్న సత్యాన్ని దేన్నో అజ్ఞాతంగా వ్యక్తీకరిస్తూనే వున్నాయి. కాని మధురభాషిణి సౌందర్యం, వెంకన్న పంతులు సిరి సంపదలూ ఆగంతకుల కళ్లపై పొరలు కప్పేలా చేశాయి.

"సిగ్గుపడుతోంది గావును. పోనీలెండి" అన్నారు పరశురామయ్య.

"బ్రతుకు జీవుడా!" అన్నట్లు నిట్టూర్చాడు, వెంకన్న పంతులు.

అంబరీషు మాత్రం భావి జీవితపు టాశాసౌధాల్ని ఊహించుకుంటూ, తదేక ధ్యానంతో మధురభాషిణ్ణి చూడసాగేడు.

'మధురభాషిణి! ఎంత అందమైన పేరు!!' అనుకున్నాడు; తనకు ఈడూ, జోడూగా వుంటుందా? తన్ను సుఖపెట్టి తను సుఖపడగలదా? అంతులేని ప్రశ్న పరంపరలతుంపర!

"మీ అభిప్రాయం ఏమిటి?" అని కదిపారు వెంకన్న పంతులు.

ఆ అమ్మాయి ఎదట ప్రస్తావన చెయ్యడం మంచిదికాదని, "ఇక నువ్వు లోపలికి వెళ్ళమ్మా!" అన్నారు పరశురామయ్య.

ఆ అమ్మాయి లేచి, నమస్కరించి లోపలికి వెళ్లింది. కాని వెళ్లేటప్పుడు ఎందువల్లో కుంటుతూ వెళ్లింది. అది చూసిన పరశురామయ్య తెల్లబోయారు. అంత వరకూ ఆనందార్ణవంలో తేలుతున్న అంబరీషూ ఆశ్చర్యంతో నిమగ్నుడయ్యాడు.

"మరేం భయపడకండి! కాలు తిమ్మిరెక్కి ఉంటుందంతే!" అన్నారు చిరునవ్వు నవ్వుతూ వెంకన్న పంతులు.

తర్వాత కట్నపు ప్రసక్తి వొచ్చింది. ఎనిమిది వేలవరకూ కట్న మియ్యడానికి అంగీకరించారు, వెంకన్నపంతులు. తక్కిన లాంఛనాల క్రింద మరో వెయ్యి. పరశురామయ్య ఆనందంతో ఉబ్బిపోయాడు; కాని మనస్సుని "పిల్ల కుంటిదేమో?" ననే బాధ పీడిస్తున్నందువల్ల, ఇంటికి వెళ్లి ఉత్తరం రాస్తామన్నారు.

"అవును; అలాగే చెయ్యండి. ఇలాంటి విషయాల్లో ఎప్పటికీ ఇంట్లో వాళ్లూ ఏకీభవించడం మంచిదే!" అన్నాడు వెంకన్నపంతులు.

మరో పదిరోజుల్లో ఆయన భార్య సుందరమ్మ వొచ్చి కాబోయే కోడలి కుంటితనాన్ని తిరిగి పరిశీలించడమై, లేదని విచారణ జరిగాక, శ్రావణ మాసంలోనే వివాహ లగ్నం నిశ్చయించబడడం, తాంబూలాలు పుచ్చుకోవడం జరిగాయి.

## 3

పెళ్ళి చాలా ఘనంగా జరిగింది. ఎంతో మంది పెద్దలు స్వయంగా వొచ్చి దంపతుల్ని ఆశీర్వదించారు. కాని ఆడపెళ్ళివారి అవ్యక్తబాధని మగ పెళ్లివారు గమనించలేకపోయారు. ఏదో రహస్యం ఉన్నట్టూ. అది బయటపడితే ఏదో కొంప మునిగి పెళ్లి ఆగిపోతుందని భయపడ్డట్టూ, సందేహిస్తున్నట్టూ కనపడే వారు. ఐనప్పటికీ అంతా సవ్యంగానే జరిగింది– "ఏడిచారు" అనే గోలచేసి వాళ్లూ, రంపపుపోట్టు తైరు చట్నీ చేసి వీళ్లూ కొంత గొడవ పడినప్పటికీ.

పెళ్లి ఒకేరోజు. మూడుముళ్లూ పడ్డాక ఏదో పెద్ద బరువుని నెత్తినుంచి దించుకొన్నట్టూ, జీవితంలో కెల్లా కష్టమైన కార్యం నెరవేర్చినట్టూ నిట్టూర్చారు, వెంకన్న పంతులు.

"అనవసర ఆలస్యం; కరువు రోజుల్లో ఖర్చధికం–ఇంకోసారైతే" అని మగపెళ్లివారు "కార్యం" కూడా ఆనాడే కానిచ్చెయ్యాలన్నారు. ఆవేళ అన్నివిధాలా మంచిదట కూడా! ఆడపెళ్లివారికి మాత్రం అంత తొందరగా చెయ్యడం అసలు ఇష్టంలేదు; ఆ వాదనలో పాల్గొంటున్నప్పుడు ఏదో భూతంలాంటి భవిష్యత్‌ను తల్చుకొని దుఃఖిస్తున్నట్టుగా కనపడసాగారు. అయినా బలవంతంగా దాన్ని కప్పిపెట్టుకుంటూ, లేనిపోని గాంభీర్యతని ప్రదర్శిస్తున్నారు. ఆఖరికి చాలా పెళ్లిళ్లలో జరిగే రీతిగా మగ పెళ్లివారి మాటే నెగ్గింది.

రాత్రి తొమ్మిదైంది. పెళ్ళి కొడుకునూ, పెళ్ళికూతుర్నీ పడక మంచం మీద కూచోబెట్టి, అమ్మలక్కలంతా తమ మనసుల చాటున దాగిన కోర్కెల్ని వెలిబుచ్చుతూ, ఆనందిస్తున్నారు– మీసాలకు సెంటు రాయడం, కిళ్లీలో మిరపకాయలుంచడం వంటి పనులు చేయిస్తో.

ఎంతకీ వాళ్ళు వొదిలేలా కనపళ్ళేదు. అంబరీషుకు కోపం వొచ్చి, ఆడ ముత్తైదువుల మీద వర్షం కురిపించినట్టుగా, పన్నీరు జల్లాడు. అభిమానపడిన ఆడవాళ్ళు చల్లగా జారుకున్నారు. ఓ ముసలమ్మ ఆ దంపతుల అవస్థ చూడలేక బాధపడి, మిగతా వాళ్ళను బయటికి పొమ్మని, అవతల గొళ్ళెం పెట్టింది. కిటికీ సందులోంచి చూస్తున్న యువతీ సంఘాన్ని పెళ్ళికూతురు తల్లి మాలతమ్మ గదిమి వెడలగొట్టింది.

వీధి గుమ్మం వద్ద, తలుపుని ఆనుకుని, కింద చూపులు చూస్తూ ఆనందార్ణవం లోనున్న మధురభాషిణి తెల్లని చీరతో, తెల్లని మల్లె పూలవాసనల్తో బంగారు బొమ్మలా నుంచుంది–చలన రహితంగా.

మంచాన్ని ఆనుకుని నుంచున్న అంబరీషు మెల్లగా ఆమె దగ్గరకు వెళ్ళి, "నా దగ్గర సిగ్గెందుకూ? తలుపు గడియవేసిరా" అన్నాడు, గొంతుకలో తీయదనాన్ని తెచ్చుకుంటూ.

మధురభాషిణి తలుపేసి, అతని దగ్గరకొచ్చి తలొంచుకుని నుంచుంది. ఒకసారి విశాలమైన నేత్రద్వయం నుండి అతన్ని ప్రేమతో చూసింది.

"ఏం! మధురభాషిణీ! ఇంకా సిగ్గే? ఇక్కడెవరూ లేరుగా!... ఇలా చూడు" అంటూ ఒక చేత్తో ఆమె గడ్డాన్ని ఎత్తి పట్టి, మరో చేత్తో దగ్గరకు తీసుకున్నాడు. ఇద్దరి చూపులూ కలిశాయి.

అతను నివ్వెరబోయాడు. విశాలమైన నేత్రాల మీద ఆనందం, మొహంలో కులుకూ, పెదిమలపైన చిరునవ్వూ ఉండడానికి బదులు కళ్లలో నీళ్ళు నిండి వున్నాయి. అతని ప్రాణం జివ్వుమంది. ఏమనాలో, ఏం చేయాలో, కారణమేమిటో, తోచలేదు.

"ఎందుకూ భయం? నేనేం కొరుక్కుతింటా ననుకున్నవా, పిచ్చిదానా?" అని లేని నవ్వుని తెచ్చిపెట్టుకుంటూ ఆ అమ్మాయిని నవ్వించాలని యత్నిస్తో, తల నిమురసాగేడు.

ఒక్కసారిగా అతని గట్టి వక్షస్థలంపై తలని ఆన్చి, వెక్కి వెక్కి ఏడ్వసాగింది. అతను అయోమయంలో పడ్డాడు. భుజాన్ని తట్టడమూ పులజడని చేతిలో తీసుకుని వాసన చూడడమూ తప్ప వేరేమీ చెయ్యలేకపోయాడు.

అతనూ ఇలాంటి కథలు చాలా విన్నాడు;- ప్రథమ సమాగమం రోజున పురుషులు మొరటుగా ప్రవర్తించినందువల్ల, ఆ స్త్రీలకు జన్మంతా వాళ్ళపైన ఏహ్యాభావం కలుగుతుందనీ, వాళ్ళ సంసార జీవితం అసంతృప్తికరంగా వుంటుందనీని.

అందువల్ల లాలనతోనే కార్యసాఫల్యాన్ని పొందాలనుకున్నాడు. కృంగిపోతున్నట్టు కౌగలిలోంచి జారి, మధురభాషిణి అతని కాళ్ళ మీద పడింది. వేడి కన్నీళ్ళు అతని పాదాలపై బడి వాటిని కడుగుతున్నాయి. కాసేపటికి దుఃఖం తగ్గి, ఎగుపు మాత్రం మిగిలింది.

అతను ఈ శుభదినం కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు, మనసులో, ఎన్నో మధుర స్వప్నాలను కన్నాడు- మొదటిరాత్రి పొందబోయే ఆనందానుభూతిని గురించి, తొలిసారిగా జీవితాన్ని చవిచూడబోతున్న ఉత్సాహమంతా నీరు కారసాగింది. ఈ ఆకస్మాక వాతావరణం, సన్నివేశం అతని మనసుని కలచివేసింది.

తనూ కూచుని, మధురభాషిణి మొహాన్ని పైకి లేవనెత్తి కళ్ళల్లోకి చూశాడు. కళ్ళల్లో నీళ్లు ఆరిపోయి, ఎర్రబారేయి. దగ్గరకు తీసుకున్నాడు. ఆమె అతని బాహుల్లో ఇరుక్కుపోయింది. దూదిలాంటి మృదుతర హస్తాలను పదేపదే స్పర్శించసాగేడు. అమాయకంగా అతని వైపు చూడసాగింది.

"ఏమిటీ కారణం చెప్పవ్? నే నేమన్నా నిన్ను కష్టపెట్టానా? లేక మా వాళ్ళెవరన్నా ఏమన్నా అన్నారా?"

మధురభాషిణి మరో విచార తరంగానికి లోబడిపోయింది. అందువల్ల నోటమాట వెలువడడం లేనట్టుంది. ఏదో చెప్పాలనే తీరని ఆవేదన మొహంపైన స్పష్టంగా గోచరిస్తోంది. ఏదో కలవరపాటు! దాని వెనకాలే 'మరుక్షణంలో తన జీవితం ఏమవుతుందో? ఇంత ప్రేమగా లాలన చేస్తున్న భర్త తన మొహం చూస్తాడా?' అనే భయం స్పష్టంగా దాగినట్టుంది.

పరిస్థితి పరాకాష్ట నందుకుంది. యథార్థాన్ని దాచడం ఎవరితరమూ కాదు. చివరికి చెప్పడానికే నిశ్చయించుకుంది, మనసులోని భావాన్ని. అతని కళ్ళలోకి బాష్పనయనాలతో పరీక్షగా చూసింది- హృదయాంతరాళాల పరిశోధన కన్నట్టుగా.

"ఆ... ఉ... ఆ... ఏ" అంది నోటికేసి వేలు చూపుతూ. గొంతు వరకూ వచ్చిన మాటలు అవ్యక్తధ్వనులై వెలువడసాగాయి. గుండె గొంతుకలో కొట్లాడుకోసాగింది.

అతని గుండెల్లో రాయి పడింది! 'ఏమిటీ? మాటలు రావూ? మూగ మనిషా, తన భార్య? తను ఆమెతో నా జీవితాంతం గడపవల్సింది? తను కన్న కలలన్నీ కల్లలేనా? భార్య తీయనిపలుకులకూ, సాదరపు వాక్యాలకు తను నోచుకోలేదా?'

మధురభాషిణిని నెమ్మదిగా కౌగిలి నుండి వొదిలాడు. ఆమె అన్నిటికీ సిద్ధమై, బలిపీఠం వద్ద నున్న జంతువులా, పిరికితనంతోనూ, నిరాశతోనూ, జాలిగా చూడసాగింది.

"మూగ దానివా?" గట్టిగా అరిచాడు. మధురభాషిణికి అతని కాళ్ళపై బడి, వాటిని గట్టిగా పట్టుకుని, తన శిరస్సును వాటికాన్చడం తప్ప గత్యంతరం లేకపోయింది. అనతి పాదాలపై మరికొన్ని వేడి బాష్పకణాలు వర్షించాయి.

అతను నిశ్చేష్టుడైపోయాడు రూపవతి ఐన భార్య దొరికింది కదా? అని కులుకుతున్న అతని శిరో ఘాతం తగిలినట్టయింది. ఆనందం అంతరించింది. చీకటితో కూడుకున్న భవిష్యత్ అతని కళ్ళ ఎదుట నాట్యం చెయ్యసాగింది.

భార్యతో హాయిగా కబుర్లు చెప్పుకుంటూ చేద్దామనుకున్న షికారులూ, ఆడదామనుకున్న సరసాలూ, తీర్చుకుందా మనుకున్న సరదాలూ, అన్ని దివాస్వప్నాలైపోవల్సిందేనా?

వాళ్ళు ఎంత నీచులు? తననూ, తనవాళ్ళనూ ఎంత వంచించారు? ఎంత సాహసం? ఎంత గొప్ప పన్నాగం? తమను ఎంత చాకచక్యంతో సాలిగూటిలో దూరే ఈగల్లా చేశారు? తను ఆపళంగా ఆ అమ్మాయిని వొదిలేస్తే? ఆమె జీవితం ఏమవుతుందో? నని కొంచమన్నా ఆలోచించారా? ఇప్పుడేం చెయ్యాలి? ఆలోచనల్తో కణతలు పగుల్తాయేమో? ననిపించింది.

ఆకుపచ్చ విద్యుద్దీపపు కాంతీ, అగరువొత్తుల నీలిపొగ వాసనలూ, మధురభాషిణి పూసిన గంధం, రాసిన సెంట్ల పరిమళాలూ, అన్నీ అదికలేమో, ఏలోకమో ననిపించసాగాయి! 'ఇది వాస్తవం కాకూడదు, భగవంతుడా స్వప్నంలా చెయ్య'మని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నాడు.

మళ్ళీ ఆ అమ్మాయి-అమ్మాయేమిటి? భార్యా రత్నమై కూచుందిగా! భార్య ముఖంకేసి చూశాడు. ప్రపంచంలో వున్న కరుణ నంతటినీ పోగుచేసి, దేవుడీ విగ్రహాన్ని చేశాడా? అనేంత జాలికరంగా అమితమైన అణకువతనంతో, ప్రార్థనా పూర్వకంగా అతన్ని చూడ సాగింది. పొడారిపోయిన విశాల నయనాల నల్ల కనుపాపలనుండి లోతుచూపులతో.

అతని హృదయానికెవరో గేలం వేసినట్టయింది. చటుక్కున ఏదో నిశ్చయానికి వొచ్చాడు. "గతము గతంబె" అనే పద్యం గుర్తుకు తెచ్చుకున్నాడు. తన భార్య! ఎంత కాదనుకున్నా భార్యేగా మరి! మూగతనాన్ని అంత గొప్ప సౌందర్యరాశికి ప్రసాదించిన సృష్టినవాలి కాని, ఆమె నేం చేస్తే ఏం లాభం? ఏ మంటే ఏం ప్రయోజనం? మొదట తెల్సుకోలేకపోవడం తమదే నేరం!

అతనికి పెళ్ళి చూపులకు వొచ్చి నప్పట్నుంచి జరిగిన సంఘటనలు గుర్తు కొచ్చాయి.

తను పాట పాడమని అడిగేడు కూడా! "సిగ్గు పడుతోంది గావును, పోనీలెండి!" అని సంభాషణ మార్చేశాడు తన తండ్రే! తాము అడిగిన ప్రశ్నల కన్నీ వెంకన్న పంతులే జవాబు చెప్పడంలోని ఆంతర్యం ఇప్పుడు తెలుస్తోందతనికి. తన తల్లి వెళ్లినప్పుడు కూడా ముసి ముసి నవ్వులు నవ్వడం తప్ప జవాబులేమీ ఇవ్వలేదట! అదీ సిగ్గుగానే భావించబడడం తన దురదృష్టం కాక మరేమిటి?

తర్వాత మళ్లీ పలకరించాల్సిన అవసరమే లేకపోయింది. నవ్వు మామూలుగా అందరిలానే వుండడంవల్ల అనుమానానికి తావేలేకపోయింది. గుమ్మాల దగ్గర పేర్లు చెప్పాల్సినప్పుడూ "రాయి"లా నిలబడి పోయింది గాని, ముత్తయిదువులు ఎంత వేధించినా చెప్పనే లేదు. చివరికి కాళ్లు పీకడం వల్ల, తనేగా "నేనూ చెప్పను" అని లోపలికి దారి తీసేసింది. అదీ సిగ్గే?

గత దృశ్యాలన్నీ తిరిగి సాక్షాత్కరించి నట్టయినాయి. అతని బాహ్య స్ఫురణ కలిగేటప్పటికి మధురభాషిణి అలాగే అతని కాళ్ళకు తల ఆన్చుకుని పడివుంది.

అంతా యథార్థమే! నమ్మలేని సత్యం! చేదు నిజం! హృదయాన్ని రాయిచేసుకుని ఆమెను లేవనెత్తాడు. ముఖంలోకి చూస్తే మనసులోని విద్వేషమంతా మాయమైంది. మంచం వద్దకు తీసుకు వెళ్లాడు. బరువుగా అడుగులో అడుగులు వేస్తూ కదిలింది మధురభాషిణి.

"మీ నాన్న, నువ్వు ఎనిమిది వరకూ చదివేవన్నాడు. మరి మాటలు రానిదానవు, చదువెలా చదువుకున్నావ్?"

పడక మంచానికి దూరంగా టేబిల్‌మీద ఫలహారాలూ, పాలూ ఉంచబడ్డాయి. దాని సొరుగులోంచి ఉత్తరాల అట్టా, పెన్నూ తీసింది. ఏదో వ్రాయసాగింది ముత్యాల్లాంటి అక్షరాల్తో- అది తన జీవిత సంగ్రహం. అతను చదువుకోసాగాడు. వాటిని చూశాక ఒక నిట్టూర్పు విడిచేడు, గుడ్డిలో మెల్ల అనే సద్భావం కలిగి.

"చెవుడు లేదుకదా?" బాధతోనే అన్నాడు. అడ్డంగా తలూపింది. అతను మూగతనానికీ, చెవుడికీ దగ్గర సంబంధం అని విన్నాడు "హమ్మ!" అని మళ్లీ నిట్టూర్చాడు- మరి కొంత బరువు తీరినట్టుగా.

తను మంచంపై పడుకున్నాడు. మధురభాషిణి రెండు నిమిషాలు అలాగే నిల్చుండి, కింద చెరగు పర్చుకుని పడుకోబోయింది.

"అక్కడ కాదు. ఇక్కడ" అన్నట్టు సంజ్ఞ చేశాడు. మూగవాడిలా- మూగవాళ్ళతో మాట్లాడడం ఎందుకనుకున్నవాడిలా.

మధురభాషిణి లేవలేదు. అతను మంచం దిగి, ఆమెని లేవదీసి, మంచం వద్దకు తీసికెళ్ళాడు. ఇద్దరూ కాసేపు ఎడం ఎడంగా పడుకున్నారు. అతనికి ఏం తోచిందో భార్యవైపు తిరిగి హృదయానికి హత్తుకున్నాడు. ఇద్దరి హృదయాలూ బాధతోనే వున్నాయి- అలసిపోయిన మనసులూ, శరీరాలూ నిద్రకు దాసులయ్యాయి.

## 4

పక్క గదిలోని కిటికీ సందుల్లోంచి రహస్యంగా జరుగుతున్నదంతా చూస్తున్న వెంకన్న పంతులు వెలుగులోకి వొచ్చి, నిట్టూర్చాడు- అంతవరకూ ఊపిరి బిగబట్టుకున్న వాడిలా. ఆయనభారం పూర్తిగా తొలగిపోయినట్టే! అల్లుడు మేథకుడిలాగే వున్నాడు. అందుకనే ఆయన ఆశించిన ప్రళయం ముంచుకురాలేదు. నిజాన్ని తెల్సుకునే, అల్లుడు తలుపులు తెరుచుకొచ్చి ఏం గోలచేసి, సంసారాన్ని బట్టబయలుచేసి, పెళ్ళివారి నందరినీ తీసుకుని యింటికి ప్రయాణమవుతాడో ననే భయం భయంగానే వుండిపోయింది. ఆయన ఎదురు చూస్తున్న దుర్భర క్షణం కనుచూపు దూరం దాటిపోయినట్టనుకున్నాడు.

"ఏం? ఏమైంది?" అని అడగసాగింది, ఆయన భార్య మాలతమ్మ. ఎంతో ఆతృతతో కూతురు దురదృష్టానికే ఆ తల్లి హృదయం రంపపు కోతతో బాధపడుతోంది. ఏవిషాద పరిస్థితులు వస్తాయో అని అరగంట నుండి ఎదురు చూస్తోంది. దాని భావిజీవితాన్ని తల్చుకుంటే తన మనస్సు చెరువు కా జొచ్చింది.

ఆయన "అంతా బాగానే వుంది" అన్నట్టు చేష్టలతో సూచించాడు. తల్లి మనస్సు శాంతించింది.

సరిగ్గా పద్నాలుగేళ్ళ క్రితం ఆ అమ్మాయిని తన పుట్టింట్లోనే కన్నది. ఆ సౌందర్య రాసిని చూసి మురవని వారెవరూ లేరు. జాతకం కూడా చాలా గొప్పది అన్నారంతా! దానికి తార్కాణంగా అమ్మాయికి మూడేళ్ళు వొచ్చేటప్పటికి తండ్రి వ్యాపారం చాలా గొప్పగా పెరిగిపోయి, ధనవంతుల పట్టికలో చేరాడు.

కాని మధురభాషిణికి అప్పటికే మాటలు రాలేదు. వాళ్ళు అల్లారు ముద్దుగా పెట్టుకున్న పేరే శాపంగా పరిణమించిందా? అని భయపడ్డారు కూడా! ఆయన తన అభీష్టగీతమైన

"వందేమాతరం" పాట నుండి ఎంచుకుని, కూతురుకి ఆ పేరు పెట్టుకున్నారు, జాతీయోద్యమ జ్ఞాపక చిహ్నంగా!

మధురభాషిణికి ఎనిమిదో నెల నుండే నడక వొచ్చింది. నడక ముందుగా వొచ్చిన వాళ్ళకు మాటలు ఆలస్యంగా వొస్తాయనే నమ్మకముంది మనలో. అదే వాళ్ళకు చాలా ధైర్యాన్నిచ్చేది.

కాని ఐదేళ్ళొచ్చినా మధురభాషిణి ఏదో అవ్యక్తమైన సణుగుడుతప్పించి, వేరేమీ మాట్లాడలేకపోయేది. అతి కష్టంమీద "అమ్మ" "నాన్న" అని మాత్రం అనగలిగేది. చివరికి అధైర్యం, అపనమ్మకం ప్రబలమయ్యాక, వైజాగూ, మద్రాసూ తీసుకవెళ్ళి పెద్ద డాక్టర్ల చేత పరీక్ష చేయించారు. వాళ్ళంతా మూగతనాన్ని బాగు చేయడమందలి ఆశక్తతని అంగీకరించారు. ఇంక ఆ తల్లి తండ్రులకు గత్యంతరం లేకపోయింది. ఆ అమ్మాయి సౌందర్యానికి ఆనందించాలో, మూగ తనానికి దుఃఖించాలో తెలీక బాధపడేవాళ్ళు.

మాలతమ్మ మెట్రిక్ వరకూ చదివింది. తీరిక కాలాల్లో తనే మధురభాషిణికి చదువు సంధ్యలు నేర్పింది.

ఈ మూగతనం గురించి లోకంలో ప్రచారం జరిగితే వొచ్చే అనర్థాలు ముందునుండీ తెల్సు! అందుకనే కొత్త వూరొచ్చి పెద్ద రాజభవనం లాంటి భవనాన్ని కొని గుట్టుగా కాలక్షేపం చెయ్యసాగారు. ఏ సినీమాకో, షికారులకో, వెళ్ళినా మధురభాషిణి ఎవరితోనూ పలకనక్కర్లేకుండా తన సర్దుకుని, ఎంతో చాకచక్యంతో ప్రవర్తించేది మాలతమ్మ. డబ్బు ఆశచూసి ఎవరికో ఒకరికి పెళ్ళిచేసి, భారం తీర్చుకునేవరకూ నిద్రపోకూడ దనుకున్నంత నైపుణ్యంతో ఆ విషయాన్ని రహస్యంగా వుంచారు-భార్యాభర్త లిద్దరూ!

కాని సత్యాన్ని దాచేందుకు మూకుడేదీ లేదు లోకంలో. అది దాస దాసీల ద్వారా కొంత బట్టబయలైంది. కాని ఎవళ్ళ మట్టుకు వాళ్ళు అసలు సమయానికి నోరు మూసుకున్నారు--మన కెందుకని. ఆయన బావ మరది మాత్రం తాంబూలాలు పుచ్చుకోవటమయ్యాక, రహస్యం బయలు పెట్టి పెళ్ళి చెడగొడతా'నని బెదిరించి ఓ వెయ్యి రూపాయలు కాజేసి నోరు మూసుకున్నాడని వినికిడి. ఎవరికైనా మధురభాషిణిని చూస్తే గుండె నిలువునా నీరై, విధిని నిందించేంత వరకూ ఉద్యమించేవారు. ఆ భావనే తక్కిన వాళ్ళ నోళ్ళు మూసుకో బడడానికి మూలకారణమై వుంటుంది-నీచాతినీచ మనస్కుడైన ఆ మేనమామగారిని మినహాయిస్తే.

మర్నాడుదయం, అంబరీషు లేచి విడిదికి వెళ్ళగానే తల్లి ఎదురైంది. అతని మనసులోని మాటను దాచుకోలేకపోతున్నాడు- అతనికి కలిగిన ఆశ్చర్యం, విచారం, ఉక్రోషం, నిస్పృహత అన్నీ అతణ్ణి శక్తిహీనుడిగా చేయసాగాయి.

“అమ్మా, మాటే!” అన్నాడు. తల్లి ఆప్యాయతతో దగ్గరకు వెళ్ళింది. చెవులో అసలు విషయాన్ని ఊదాడు.

“ఆ–ఏమిటీ నువ్వనేది? అంతా మోసమా? మూగపిల్లతో నువ్వేం కాలక్షేపం చేస్తావురా? వాళ్ళకి తగిన శాస్తి దాన్ని వొదిలి పోవడమే!” గట్టిగా అరవ సాగింది.

అతను, “ఊరుకోవే; మనం కళ్ళుమూసుకుని చేసుకున్న దానికి వాళ్ళమీద యెగరడమెందుకు? రెండుసార్లు పరీక్షించుకున్నాం కూడా!” అనసాగాడు. కాని దెబ్బతిన్న తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. అందుకని “నువ్వూరుకోరా, కపటసన్యాసీ! ఇంతిలా కొంప మునిగిపోతే, నన్ను నోరుమూసుకోమంటావేం, సిగ్గులేక?” అని అరిచింది.

మళ్ళా “వాళ్ళేదో మందుపెట్టివుంటారు, బాబోయ్! ఇంతిలా కళ్ళల్లో కారం కొట్టగలిగిన వాళ్ళు దేనికైనా తగుదురమ్మా” అంటూ అరుస్తూ గోల చెయ్యసాగింది.

అంతలోకి బంధుజన మంతా పోగయ్యారు. అందరూ ముక్కుమీద వేలు వేసుకునే వాళ్ళే! తండ్రి కూడా ప్రయాణసన్నాహం కావాలన్నాడు. కాని అతను అంతా ముందే నిశ్చయించుకున్నాడు. అందుకనే తల్లితో మెల్లిగా చెప్పి, ఏమీ గొడవ లేకుండా వొప్పించాలనుకున్నాడు. కాని అది వ్యతిరేకమై వూరుకుంది. సాధారణంగా ఆడవాళ్ళు అంతే! మగవాళ్ళు అనుకునేదొకటీ, వాళ్ళ ప్రాబల్యం వల్ల జరిగేదొకటీని!

కాలకృత్యాలన్నీ తీర్చుకుని, మంచి బట్టలు వేసుకుని, ఇంట్లో ఎవరికీ చెప్పకండా రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడు.

బజారులో మంచి కాఫీ హోటల్ కనిపిస్తే, ఒకప్లేటు పూరీ, వేడి కాఫీ సేవించి బయటపడ్డాడు. అంత సేపూ హోటల్లో ఏమీ పరిశీలించలేదు. ఏదో లోపలి చూపు ఎక్కువైంది. అంతరవలోకనం చేసుకుంటో ఏవేవో ఆలోచించుకో సాగేడు. నిన్న ఈ సమయానికి ఉచ్ఛదశలో నున్న అతని మానసిక స్థితి నేడు అగమ్య గోచరమైంది. భావిశూన్యుడిలా భావించుకున్నాడు, తన అవస్థ.

తిన్నగా నడిచి భరద్వాజ ఇంటికి వెళ్ళాడు. అక్కడ తలుపు ఓరగిలా వేసివుంది. పిలవాలా? వొద్దా? అనే సంశయంలో పడి, కాసేపు బయటే మౌనంగా నుంచున్నాడు.

అప్పటికి ఎనిమిది కొట్టి వుంటుంది. ఆకస్మాత్‌గా ఈ అరుపులతో కూడిన సంభాషణ అతని వీనులకు సోకింది.

“ఎనిమిదైనా రాచిప్పల్లే అలా కూచుండిపోతే ఎలా? ఇంత బజారు కెళ్ళడం, నాలుగు కూరలు తేవడం అంటూ ఏమన్నా ఏడుస్తుందా? అంటాను. అస్తమానం ఆ కాంపోజిషన్ పుస్తకాలు ముందేసుక్కూచుంటే ముద్ద నోట్లోకి అకస్మాత్‌గా వొచ్చి కూచుంటుందనుకున్నారా?”

“మొన్న ఆదివారమేగా నాలుగు కూరలూ తెచ్చి పడేశాను. తెస్తాలే. ఈ వేళ కేదో పచ్చడి చేసి కాలక్షేపంచెయ్యి. ఇది చాలా అర్జంటు పని”

"ఇంతోటి అరవై రూపాయల నౌఖరీకి అర్జంటుకూడాను, వెళ్ళండి– త్వరగా తేవాలి. లేకపోతే నే వంటచేసేదే లేదు!" తర్వాత కొన్ని క్షణాల నిశ్శబ్దం, జోళ్ళధ్వని గుమ్మము వైపు రాసాగింది. అంబరీషు వెనక్కి పోదామనుకుని రెండు మెట్లు దిగేడు.

తలుపు తెరచి వొస్తున్న భరద్వాజ, అతన్ని చూసి "రావోయ్, అంబరీషూ, ఎంత సేపైంది వొచ్చి? పిలువనన్నా లేదేం?" అంటూ ఆహ్వానించసాగేడు. కాని అంతలోకే అతని మొహం, ఏదో రహస్యం బయటపడ్డవాడిలా వెల వెల బోసాగింది.

"ఇప్పుడే వచ్చానులే, నడు. నేనూ బజారుకేవొస్తాను" అన్నాడు అంబరీషు. ఇద్దరూ మళ్ళీ హోటల్‌కు దారితీశారు. కాఫీ తాగాక, భరద్వాజ కూరల కొంటుంటే అంబరీషు చాలా కొనిపించి, బిల్లుని తనే ఇచ్చాడు– వద్దంటున్నా.

"అయితే ఈ వేళ నువ్వు మా యింట్లో భోంచెయ్యాలి" అన్నాడు భరద్వాజ. కాని అతని కళ్ళల్లో లోతైన బాధ, దాగని అనుమానం ప్రస్ఫుటంగానే కనపడసాగేయి.

"చేస్తా, దానికేం? ఒక్క షరతు మీద"

"ఏమిటది?"

"నువ్వు కాజుయల్ లీవు పెట్టాలి?"

"ఓస్, అదేనా? నాకు సెలవులన్నీ అలాగేవున్నాయి. నాలుగు రోజులు పెట్టమన్నా అభ్యంతరం లేదు."

"అందుకేనేమో, నిన్న పెళ్ళి సమయానికేనా రాలేదు."

"దానికి నన్ను క్షమించాలోయ్! నేను రాలేకపోవడానికి వేరే కారణం ముందిలే?"

"ఏమిటదీ?"

"నువ్వు నమ్ముతావో లేదో నని అనుమానంగా వుంది."

"అసలు అదేమిటో చెప్పందే?"

అలాంటి గొప్పచోట్లకి వొచ్చేంత మంచి దుస్తులు లేకపోయాయోయ్!"

"స్నేహమే ఉంటే దుస్తులే అడ్డొస్తాయా?"

"అడ్డురావు. కాని అందరూ నీ లాంటి విశాల హృదయులుండొద్దూ? నేడు లోకంలో గౌరవంపై డాబుల్ని చూశేగా!"

"నిజమే ననుకో"

అప్పటికి వాళ్ళు భరద్వాజ ఇల్లు చేరారు. కూరలు ఇంట్లోపడేసి, అంబరీషు భోజనానికి వొస్తాడనీ, భోజనానికి తొందర లేదనీ చెప్పి, మళ్ళా మిత్రుడి దగ్గరికివచ్చాడు భరద్వాజ; కాని ఆ యిల్లాలొక దీర్ఘం తీసి, ఏదో అతనికి వినపడకండా సణుక్కుంది. తర్వాత ఒక సెలవు చీటిరాసి, వీధిన పోతున్న విద్యార్థి కిచ్చి, హెడ్మాష్టరు గారికిమ్మన్నాడు భరద్వాజ!

మళ్ళీ మిత్రులు సంభాషణల్లో పడ్డారు అది భరద్వాజగది. ఒక కుర్రకుర్చీ, ఒక ఇనుప పడకకుర్చీవున్నాయి. ఆ పడక కుర్చీలమీద వున్న బల్లే అతనికి రాసుకునేందుకూ, తదితర మైన పనులకూ తోడ్పడుతుందని తెలుస్తోనే వుంటుంది.

ఎదురుగా మూడు అరలు కలిగిన అల్మారు వుంది. పై అరలో అద్దం, దువ్వెన మొదలయిన సామానూ, మధ్య అరలో స్కూలు టెక్స్టు పుస్తకాలూ, కిందనున్న అరలో పత్రికలూ, తదితర జనరల్ బుక్సూ వున్నాయి. గదంతా సింపిల్‌గా వుంది. ఇంకా మిత్రులెక్కువవుతే ఉపయోగపడడానికిలా వుంది, ఓ చాపవుంది ఓమూల.

"నీ పెళ్ళి విశేషాలేమిటో చెప్పవ్. వినేనా సంతోషిస్తాను." అన్నాడు భరద్వాజ.

ఒక్కసారిగా అంబరీషు ముఖం కందిపోయింది; కంఠం రుద్ధమైంది:

"పెళ్ళికూతురు మూగదోయ్!"

"నీభార్యా?"

"అవును!"

భరద్వాజ నిర్విణ్ణుడయ్యాడు! దాన్ని నమ్మలేక అతన్ని పరీక్షగా చూడసాగేడు. అతని సీరియస్‌నెస్‌ని గుర్తించాక నమ్మక తప్పలేదు. చాలా సేపు మౌనంగా చూస్తూ కూచున్నారు ఇద్దరూ.

చివరికి "నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్" అన్నాడు భరద్వాజ.

"నాతలకాయ!"

"నిజంగానే ! నువ్వు వచ్చేముందు మా ఇంట్లో జరిగిన గోలవిని, వెనుదిరిగి పోబోయావు కూడా! అవునా? నిజంగా నోరున్న ఆడవాళ్ళ కంటే, మూగవాళ్ళే నయమని నా నమ్మకం!"

కొంచెం స్వరం తగ్గించి, చిన్నప్పుడు తమకు జరిగిన వాదనా, తమ జీవితంలో అనుభవిస్తున్న బాధా, అన్నీక్లుప్తీకరించి చెప్పాడు భరద్వాజ.

"అతివృష్టీ అనావృష్టీ కూడా దోష భూయిష్టమేలే?" అన్నాడు చివరికి, సంగ్రహపరుస్తూ.

"........... తిన్న షాక్ తర్వాత ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోందోయ్" అన్నాడు అంబరీషు విచారంతో

"అంత పనిమాత్రం చెయ్యకు. జీవితం అంతు కనుక్కోవడమే మనవిధి."

ఆరోజు చాలాభాగం ఇద్దరూ అలాగే మాట్లాడుకుంటూ గడిపారు.

అంబరీషూ, భరద్వాజా పెళ్ళి వారింటికి వొచ్చేటప్పటికి, రెండైంది. ఒంటిగంట బండికే మగపెళ్ళి వారంతా వెళ్ళిపోయారని తెల్సింది. పరశురామయ్యగారు కొడుకుపేర ఒక ఉత్తరం రాసి పెట్టారు. అది విడిదికి ఇల్లు ఇచ్చిన వాళ్ళు అతనికిచ్చారు. అంబరీషు దాన్ని చదివితే దానిలో "తక్షణం వచ్చెయ్య" మని వుందంతే.

వెంకన్నపంతులు, అపరాధిలా మొహం పెట్టి వెళ్ళి ఓ మూల అరుగుమీదున్న పడక కుర్చీలో పడివున్నాడు. ఆడ పెళ్ళివారంతా, అందులోనూ ఎక్కువగా ఆడవాళ్ళే అతన్ని చుట్టుముట్టేరు. కాని అతనితో ఎవరికీ మాట్లాడ్డానికి ధైర్యం లేకపోయింది.

అతను భరద్వాజతో బాటు లోపలికి వెళ్ళాడు. మాలతమ్మగారు తెల్లబోయి నుంచుంది, వొంటరిగా.

"మధురభాషిణిని రమ్మన మనండి" అన్నాడు అంబరీషు. ఆవిడ లోపలికి వెళ్ళింది. వీధిలో వాళ్ళు చెవులు పెద్దవి చేసుకుని రాబోయే సంఘటనని ఎదురు చూస్తున్నారు.

"ఏం చేద్దామని?" భరద్వాజ అడిగేడు.

"నాతో తీసుకు వెడతా!"

"ఎప్పుడు?"

"ఇప్పుడే!"

భరద్వాజకు సాధారణంగా ఇతరుల విషయాల్లో కలుగజేసుకోవడం ఇష్టంలేదు. కాని ఇప్పుడు మిత్రుడీ అవస్థ చూస్తుంటే కల్పించుకోవాలని వుంది. కాని ఏమని సలహా నీయగలడు?

మధురభాషిణితో బాటు, మాలతమ్మ కూడా వొచ్చింది. ఆ అమ్మాయికళ్ళు ఎర్రగా జ్యోతుల్లావున్నాయి. ఆమెను చూస్తో భరద్వాజ నివ్వెరబోయాడు. మిత్రుడు తనతో పరియాచక మాడలేదు కదా!

"నాతో వొస్తావా ?" అంబరీషు అడిగేడు, తీవ్రస్వరంతో.

"ఊ అన్నట్టు తలూపింది."

"ఐతే నీ సామానులు అవీ సర్దుకుని సిద్ధంగా ఉండు. అరగంటలో బయలుదేరాలి" అని భరద్వాజతో పాటు తన విడిదికి వెళ్ళాడు, తన బట్టలు అవీ సర్దుకునేందుకు.

పరిస్థితి అగమ్యగోచరంగా ఉండడం వల్ల ఎవరికీ గాని ఏమనాలో తెలీలేదు. వెంకన్న పంతులు కూతుర్ని తొరగా సిద్ధం కమ్మన్నాడు. మాలతమ్మ పెట్టీ, బెడ్డింగూ సర్దించింది. వాటితోబాటు మిఠాయి, అటుకులూ, అరిసెలూ, వేసిన బుట్టా, పసుపు కుంకుమల మూటలూ అన్నీ సిద్ధపర్చింది.

భరద్వాజ అతన్ని అడిగాడు : "ఎందుకిలా తొందరపడుతున్నావ్?" అంటూ.

"తొందరేం లేదోయ్! అనవల్సిందేదో అయిపోయింది. అందుకని ఇప్పుడు గతాన్ని తల్చుకుని వగచి లాభంలేదు. ఇక్కడ్నించి ఇంటికి పోయాక, కొన్నాళ్ళకు–అసలు రావడమంటో వుంటే– మనశ్శాంతి వస్తుందేమో చూడాలి. ఇక, పెళ్ళి చేసుకున్నాను కనక ఆమెనీ నాతోనే తీసుకు పోదల్చాను–వస్తేను. యిక వీళ్ళతో యెలాంటి సంబంధమూ కలిగి ఉండ దల్చుకోలేదు."

మిత్రుడి పరిస్థితికి భరద్వాజ మనసూ కరిగి, కలగిపోయింది. ఏమీ సలహానివ్వ లేకపోయాడు. "సరే, మంచిది" అనడం తప్ప.

వెంకన్నపంతులు స్టేషన్ వరకూ వొస్తానన్నాడు. మధురభాషిణికీ, మాలతమ్మకూ కూడా కళ్ళ నీళ్ళు నిండాయి. తల్లి ఆపుకోలేక బావురంది. పమిట చెంగులో మధురభాషిణి భారమైన హృదయంతో కదిలి బండి ఎక్కింది. "అమ్మా! అక్క ఎక్కడికి పోతోంది" అన్నాడు ఆమె తమ్ముడు తల్లితో.

అంబరీషు, ఎవరూ స్టేషన్‌కు వొచ్చేంత శ్రమతీసుకో నక్కర్లేదనీ, తన మిత్రుడి తోడ్పాటుందనీ చెప్పాడు. వాళ్ళిద్దరూ గుర్రబ్బండిలో ఎక్కేరు. భరద్వాజ సైకిల్ రిక్షామీద అనుసరించాడు. ఆ అపూర్వ సంఘటనను చూడ్డాని కన్నట్టుగా రోడ్డు కిరువైపులా ఉన్న కుటుంబాల వాళ్ళు పిన్నలూ, పెద్దలూ, బయటికొచ్చి నిలబడ్డారు.

వాళ్ళు స్టేషన్‌కు వెళ్ళేటప్పటికి రైలు ప్లాటుఫారంమీదికి వొచ్చింది. భరద్వాజ అతనికి చాలా తోడ్పడ్డాడు. రైలు కదలుతుంటే అంబరీషుతో బాటు, మధురభాషిణి కూడా భర్త మిత్రునికి మౌనంగా నమస్కరించింది.

## 5

రైల్లో దాదాపు పది, పన్నెండు గంటల సేపు నూతన వధూవరులు కల్సే ఉన్నారు.

మధురభాషిణి భర్తను ప్రేమగా చూస్తూ భావిజీవితాన్ని తల్చుకుంటూ, తన దురదృష్టాన్ని నిందించుకుంటూ గడిపింది. అంబరీషూ అంతే! మనసులో ఎన్నో భావాలు కలిగేవి. వాటిని భార్యకు చెప్పాలనుకునేవాడు. కాని ఏంలాభం? జవాబు రాదుగా! ఏదో ముఖభంగిమలూ, చేష్టలుతో వొస్తుందనుకున్నా, అంత మందిలోనూ అది బాగుండదనిపించిం దతనికి.

పెట్టెలోని ప్రయాణీకుల దృష్టిని ఆకర్షించే సౌందర్యంగల భార్యని కలిగివున్నాననే గర్వం మొలకెత్తినా, మూగతనం గుర్తుకొచ్చి, అది కాస్త మటుమాయమయ్యేది.

మధ్యలో వాటరింగ్ స్టేషన్ వద్ద అతను కాఫీ, టిఫిన్ తీసుకునేవాడు.

మధురభాషిణి వేటీని వద్దంది. బుట్టలోని అటుకులనే కొన్నిటిని తింది; అదైనా అతని బలవంతంమ్మీద. కాఫీతెచ్చి తాగమన్నాడు. కాదనలేక తాగింది.

అతను కాసేపు కునుకుతీశాడు. మధురభాషిణికి నిద్ర రాలేదు. అంతా వింత మార్పుగా, పునర్జన్మ నెత్తుతున్నట్టుగా, భావి శూన్యంగా అనిపించింది. తన అత్తారింటికి చేరిన నాటినుండీ చేయాల్సిన విధులూ, తను నిన్నటి నుండి చూస్తున్న సంఘటనలూ, వింటూన్న విషయాలూ, మనో నేత్రం ఎదుట ప్రత్యక్షమవసాగేయి.

'కోపతాపాలతో ప్రారంభమైన కుటుంబ జీవితం ఎలా నడుస్తుందో? ఎలా ముగుస్తుందో?' అని తలపోయసాగింది, నిద్రలో జోగుతున్న భర్తని చూస్తూ, వెర్రిగా.

కొన్ని దినాలు గడిచాక కింగ్సువేలో నున్న తమ కంపెనీ ఆఫీసు ముందు నిలబడి వున్నాడు అంబరీషు.

ఎవరో మంచి కారులో ఆగి, అక్కడ దిగేరు. ఆగంతకుడు వులన్ సూటులో నల్లకళ్ళజోడుతో వున్నాడు.

అప్పటికి సాయంత్రం నాలుగున్నర అయింది. అంబరీషం యింటికి పోదామనుకుంటున్నాడు. కాని తన తండ్రి కారేసుకుని ఎక్కడికో వెళ్ళాడు. ఆయన కోసం ఎదురు చూడసాగేడు.

ఆగంతకుడు "హల్లో! మిస్టర్, అంబరీషూ" అని షేక్‌హేండ్ చెయ్యసాగేడు; మొదట అంబరీషు తెల్లబోయాడు. కాని కొద్ది సేపట్లోనే అతన్ని గుర్తించాడు.

"నువ్వు...నువ్వు మాధవరావువి కదూ?"

"అవునోయ్! నిన్ను చూసే ఆగేను. నువ్వు గుర్తుపట్టనే లేకపోయావ్! చూశావూ? అంతలో వుంది మిత్రత్వం!"

"నువ్వు చాలా మారిపోయావోయ్. అందుకని..." అంబరీషు నసిగేడు.

"అది సరేకాని, నువ్విప్పుడేం చేస్తున్నావు?"

అంబరీషు క్లుప్తంగా చెప్పి తమ ఆఫీసునంతా చూపేడు.

"నా కారులో పోదాంరా! తలుపులు వెయ్యమను" అన్నాడు మాధవరావు.

నౌఖర్ తలుపులు మూశాడు. తాళాలు జాగ్రత్తగా వెయ్యబడ్డాయి.

ఇద్దరు మిత్రులూ ఇండియా కాఫీహౌస్‌కి వెళ్ళి ఆమ్‌లెట్లూ, కాఫీలు కానిచ్చి, అంబరీషు ఇంటివైపు వెళ్ళారు. దారిలో మిత్రుడ్ని తన అతిథ్యం స్వీకరించమని అన్నాడు, అంబరీషు.

మాధవరావు తన సంగతి చెప్పాడు. ఢిల్లీలోవున్న ఆంధ్రుల సహాయార్థం అక్కడ ప్రాక్టీసు పెట్టాడట ధనాదాయం బాగానే వుందన్నాడు.

"సర్జరీలో మనకు పెట్టింది పేరనుకో బ్రదర్" అన్నాడు సగర్వంగా.

చిరకాల సందర్శనానంతరం మిత్రద్వయం ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకోసాగారు. కారు టాంక్ బండ్‌మీంచి హైదరాబాద్‌లో ప్రవేశించింది. "హిమయత్‌నగర్ వైపు పో" నిమ్మన్నాడు, అంబరీషు డ్రైవర్‌తో.

అంబరీషు ఇల్లు చాలా అందంగా జర్మన్ ఫాషన్‌లో కట్టబడి వుంది. చుట్టూ పెద్ద కాంపౌండ్ వాల్ వుంది. ముందు తోట. పక్కగా కారు గేరేజ్. అంతా ఆధునిక సౌఖ్యాలను కలిగివున్న భవనంలా వుంది.

"ఇల్లు చాలా బావుంది లే! బలేఛాన్సు!" అన్నాడు మాధవరావు.

"అది మాత్రం సులువుగా దొరికిందనుకున్నావా? ఎంతో కష్టపడ్డాకనే. అద్దె మాత్రం బావులేదోయ్, కల్దార్ నూట యాభై రూపాయలు" అన్నాడు.

మిత్రుడ్ని, ఇంట్లోవున్న తల్లికీ భార్యకీ పరిచయం చేశాడు. వంటమనిషి నాలుగు కప్పులు కాఫీతెస్తే, అది నలుగురూ సేవించారు.

మాధవరావు కాసేపు మాట్లాడ్డమయ్యాక, "ఎక్కడోపనుం"దనీ, "వెళ్ళిపోతా"వనీ అన్నాడు.

అంబరీషు రాత్రి భోజనానికి రావాలని పట్టుబట్టాడు. అతను అతి కష్టంమీద ఒప్పుకున్నాడు, రాత్రికి అతని అతిథిగా వుండడానికి.

మధురభాషిణి చాలా మారిపోయింది! ఎంతో పెద్ద వయస్సు కలిగిన దానిలా కనపడుతోంది.

అత్తమామలు ఆర్నెల్ల వరకూ కన్నెత్తి చూడలేదనే విచారంతో కృంగిపోయింది. అవమానంతో లోలోపల కుములసాగింది. భర్త కూడా మాట్లాడేవాడు కాదు, ఎప్పుడో తప్ప! ఐనప్పటికీ తాను అతని ముఖంలో చదువ గలిగిన సానుభూతి పూర్వకమైన మౌన భాషలే ఆమెకు జీవితంలో కాస్త మనశ్శాంతినిచ్చేవి.

మరో అరగంటలో పరశురామయ్యగారు వొచ్చారు, "ఏరా నీకోసం మళ్ళీ ఆఫీసు వరకూ పోయొచ్చా" అంటూ.

అంబరీషు జరిగిన సంగతంతా చెప్పాడు.

రాత్రి ఎనిమిదింటికి మాధవరావు భోజనానికి వొచ్చాడు. భోజనశాలలో తండ్రికి పరిచయం చేశాడు అంబరీషు. అంతా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు.

భోజనం ఆఖరయ్యే సమయంలో మాధవరావు ఇలా అన్నాడు:- "అంతా బాగుంది కాని, నీ భార్యను మూగనోము పట్టించే వేమిటోయ్, ఈవేళ" అని.

మధురభాషిణి ముఖం వెలవెల బోయింది. అంబరీషు ముఖం విచారమేఘావృతమైంది.

"ఆవిడకు మాటలు రావోయ్" అన్నాడు రుద్ధ కంఠంతో.

మాధవరావు నివ్వెరబోయాడు; విద్యుత్ ప్రవహించినట్టుగా ఐంది.

అందరూ సీరియస్‌గా కొన్ని క్షణాలు నిశ్శబ్దాన్ని వరించారు.

"ఏమిటీ-మూగ తనమూ?" మాధవరావు ప్రశ్నించాడు.

"అవును"

"మరిందాకా చెప్పలేదేం? నేను పరీక్షించుదునుగా! నేను మూగా, చెముడూ, గుడ్డీ మొదలైన వాటిలో స్పెషలిస్టును, పగలైతే పరీక్షించేవాడినే!"

అంబరీషు అతనికి సాయంత్రం ఆ విషయం ఎందుకు చెప్పకపోతినా? అని చింతించ సాగేడు.

మాధవరావు ఇదివరకు తను నయంచేసిన వింత కేసుల్నీ, తన అమెరికా పర్యటనానుభవాల్నీ, అన్నిటినీ చెప్పాడు.

"వాళ్ళ వాళ్ళు చిన్నప్పుడు మద్రాస్, వైజాగ్ మొదలైన చోట్లకు తీసుకు వెళ్ళారుట. కాని డాక్టర్లు ఏం లాభం లేదన్నారట". అంబరీషు పాత గాథని తవ్వసాగేడు.

"ఎన్నాళ్ళ కిందట"

"పన్నెండు, పదమూడేళ్ళ కిందట"

"మళ్ళా చూపించలేదా అమ్మా?" అన్నాడు మధురభాషిణితో.

"లేదండి" అన్నట్టుగా తలూపిందామె.

"అసలు పుట్టుకతో వొచ్చిన మూగతనం పోదుట కదండీ" అన్నారు పరశురామయ్య.

"అది అన్ని సందర్భాల్లోనూ కాదు. కొన్ని రకాలైన మూగతనాన్ని బాగు చేయవచ్చు ఏదీ, నేనుదయం చూసి చెబుతా లెండి" అని కొంచెం ధైర్యం కలిగించాడు.

"మీకు వెయ్యి విధాలుగా కృతజ్ఞులమై వుంటాం-వెయ్యి జన్మాల వరకూ; మా కోడలికి కొంచం మాటలు వొచ్చే మార్గం చూద్దురూ" అని ప్రాధేయపడింది సుందరమ్మ-ఆడవాళ్ళకు సహజమైన ధోరణిలో.

తర్వాత మిత్రులు పిచ్చిపాటీ కబుర్లలలో దిగేరు. అంబరీషు తన వివాహపు సంగతంతా చెప్పి మిత్రుడి హృదయాన్ని కదిపేడు. మాధవరావు తన వైవాహిక జీవితాన్ని గురించి చెప్పాడు.

"నాకు ఒక్కటే అనుమానం వుందోయ్?"

"ఏమిటది?"

"మధురభాషిణికి పిల్లలు మూగతనంతో పుట్టరుకదా?"

"భౌతిక సంబంధమైన లోపాలు వంశ పారంపర్యా రావోయ్" అన్నాడు డాక్టర్. అతను రాత్రి వెళ్ళిపోతూ, మర్నాడు తప్పక వచ్చి పరీక్ష చేస్తానని మాటిచ్చి వెళ్ళాడు.

"నా భార్యకు వాక్కు ప్రసాదించు భగవంతుడా!" అనుకున్నాడు అంబరీషు మనసులో.

## 6

మర్నాడుదయం మాధవరావు అన్న వేళకి హాజరై, మధురభాషిణిని పరీక్ష చేసేడు.

రోజూ భారంగా, ఎద్దుబండి నడకలా, సాగుతున్నట్టుండే సంసారం ఆవేళెంతో కలకలలాడుతూ వుంది.

మాధవరావుకి చాలా ఆశ కలిగింది, ఈ కేసుని సులువుగా సాధించవొచ్చని. అందుకని ఇలా అన్నాడు:- "ప్రపంచం పదమూడు సంవత్సరాల కంటే నేడు శాస్త్ర రీత్యా ఎంతో ముందడుగు వేసింది. అలాంటి మార్పును మీరు గమనించకండా ఇన్నాళ్ళ నుండీ ఎలా బాధ పడుతున్నారోనని నేను చాలా ఆశ్చర్యపోతున్నాను. దీన్ని జయప్రదంగా నేను నెరవేర్చగలనని ధీమాతో చెబుతున్నాను." ఆమాటలే వాళ్ళ ధైర్యానికీ, ఉత్సాహానికీ కారణభూతమయ్యాయి. మధురభాషిణి ఆనందానికి మేరలేదు.

మాధవరావు అంబరీషు కంతా సాకల్యంగా చెప్పాడు : తమ వారంరోజుల్లో డెల్హీ వెడుతున్నాననీ, వెళ్ళగానే టెలిగ్రాం ఇస్తాననీ, వెంటనే విమానం మీదరమ్మనమనీని.

అంబరీషు ఆనంద సాగరంలో తేలసాగేడు.

మిత్రుని ఇంటిలో కాఫీ త్రాగి, మరోసారి ప్రోత్సాహమిచ్చి, మాధవరావు వెళ్ళిపోయాడు.

## 7

మాధవరావు సుప్రసిద్ధుడైన సర్జన్ ! చాలా విదేశాలు తిరిగి వొచ్చాడు. అతని హాస్పిటల్‌లో ఎన్నో అధునాతనమైన పరికరాలున్నాయి. డెల్హీలో స్వంత ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్లలో మేటివాడు. సుప్రసిద్ధ ప్రభుత్వ డాక్టర్లు కూడా అతని మేధాశక్తి సంపదనూ, సర్జరీలో వున్న నైపుణ్యాన్ని పరోక్షంగా నైనా స్తుతిస్తూ ఉంటారు.

"అంతా ఓ నెల పట్టింది. ఆపరేషన్ జయప్రదమైంది. కాని చాలా కష్టమైనదే! అతనికి గల అనుభవాన్ని బట్టి అది చాలా తేలికదిలా కనిపించేలా చేశాడు. ఆ శాస్త్రీయ వివరాలను ఇక్కడ వివరించడం అనవసరం.

కాని మనకు కావాల్సింది మధురభాషిణికి వాక్ప్రసాదం కలిగిందనేదే!

మొట్ట మొదటిసారిగా "ఏ...మం...డీ" అంది, అంబరీషును చూస్తూ-చాలా నీరసంగా. ఐనా అదే దివ్యామృత వాక్కులా వినిపించింది అతనికి. ఆమె చేతిని తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు. తర్వాత ముందు కొంచెం తడబనా క్రమంగా మాటలన్నీ మాట్లాడసాగింది.

మాధవరావు ఎంత పని తొందరలో వున్నా, స్నేహితుడ్ని ఏమరుపాటుతో చూళ్ళేదు. ఆ దంపతుల్ని తమ ఇంటిలోనే ఆగమన్నాడు.

అతని ఆతిథ్యాన్ని వాళ్ళూ చాలా గొప్పగా భావించుకున్నారు. అంబరీషు దృష్టిలో యేదేవుడో శాపం వల్ల ఈ నరజన్మ యెత్తి, తనకు తోడ్పడడానికి మాధవరావైనట్టుగా ఉంది!

మధురభాషిణికీ అంతే! అతన్ని ఎంతో గౌరవంతో, కృతజ్ఞతాభావంతో చూసేది, అందుకే.

చివరికి వెళ్ళే రోజున, "వెళ్ళి వొస్తాం. అన్నగారూ! మీరు ఆశీర్వదించాలి" అంది కాళ్ళకు నమస్కరిస్తూ. అతని కుటుంబాని కంతకీ కళ్ళ నీళ్ళు నిలిచాయి-ఈ రాబోతున్న ఎడబాటు కన్నట్టుగా.

## 8

తిరుగు ప్రయాణం గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో. తండ్రికీ, మామగారికీ చెరొక ఎక్స్‌ప్రెస్ వైరూ ఇచ్చాడు, బయలుదేరే ముందు, అతను.

ప్రయాణమంతా చాలా ఆనందంగా గడిచింది. దారి పొడుగునా ఏవో మాట్లాడుకుంటోనే వున్నారు. అంబరీషు ఆనందానికి పట్ట పగ్గాలు లేవు. మధురభాషిణి చిన్నతనం నుంచీ

మాట్లాడుతున్న దానిలా మాట్లాడసాగింది. అతని కాశ్చర్యం వేసింది-అంత భాష ఇన్నాళ్ళూ ఎక్కడ దాగిందా? అని.

ఏవేవో విషయాలు చెప్పేది! అతనూ చిరకాల ఈప్సితం ఈడేరుతున్నందున ఎంతో శ్రద్ధగా వినసాగేడు. మధ్య మధ్య మాటలు కలిపేవాడు. అంతా మెస్మరిజం జరిగి, వాళ్ళ జీవిత గమనాన్ని మార్చినట్టనిపించింది ఇద్దరకూ.

తల్లీ, తండ్రీ సికిందరాబాద్ స్టేషన్‌లో కల్సారు. రైలు దిగగానే వాళ్ళు కలుసుకున్నారు. మధురభాషిణి, "నమస్కారమండి," అంటూ నమస్కరించింది. అత్తగారు కోడల్ని దగ్గరకు తీసకుని ఆశ్చర్య చకితురాలైంది. పరశురామయ్య కళ్ళప్పగించి మాయా సమ్మోహితుడిలా నోరు తెరవలేకపోయాడు.

ఇంతలోకి అదే రైలు దిగిన మాలతమ్మా, వెంకన్నపంతులూ, కొడుకూ, సామాను మోయించుకొంటూ వీళ్ళకు కనబడ్డారు. మధురభాషిణే వాళ్ళను చూసింది.

"మా నాన్న" అంది. అంబరీషు అటువైపు వెళ్ళాడు. మాలతమ్మ కూతుర్ని కౌగలించుకుంది. వెంకన్నపంతులు ఆనంద బాష్పాలలో చూడ సాగేడు-కూతురి మాటల్ని వింటూ ఆమె తమ్ముడు అక్క నోటివైపు వింతగా చూడసాగేడు. సంసార మంతా సంతోషజలరాశిలో తేలింది, కొన్నాళ్ళబాటు.

## 9

ఇది జరిగిన రెండేళ్ళ నాటికి వాళ్ళ ఇంటి పరిస్థితులన్నీ మారి పోయాయి. తల్లి సుందరమ్మ గుండె జబ్బుతో మరణించింది. తండ్రి వైరాగ్యం పొంది ఉత్తరాది యాత్రాముఖుడై వెళ్ళాడు.

అంబరీషుకు చెప్పలేని పని! మధురభాషిణి ఒంటరితనాన్ని సహించలేకపోయేది. అతను ఇటు వ్యాపారాభివృద్ధా? అటు భార్యతో కులాసా జీవితమా? అనే సందిగ్ధంలో పడ్డాడు. కాని వ్యాపారంలో తన పలుకుబడిని కోల్పోదల్చుకోలేదు. అందుకని కొంచం మధురభాషిణి వైపు దృష్టిసన్నగిల్లింది.

మాటలు వొచ్చాక మధురభాషిణి మనస్తత్వం మారింది. అదిగాక ఇంటి పెత్తందారిణి కూడా అయింది. ఈ పద్దెనిమిదేళ్ళు మాట్లాడని లోపమంతా సాధ్యమైనంత త్వరలో తీర్చుకోవాలనుకున్నంత వింత ధోరణిలో పడ్డట్టుగా కన్పడేది. భర్త అవకాశం ఇచ్చేవాడుకాదు. సమయానికి గొంతులో ఇన్ని మెతుకులు వేసుకుని. రాత్రి ఎనిమిదింటికి తిరిగి వొచ్చేవాడు. అతనికి మధురభాషిణి అతి వాగుడు ధోరణి తలనొప్పి కలగజేశేలా వుంది.

ఒకరోజున అతను చాలా ఆలస్యంగా వొచ్చాడు. వ్యాపారంలో ఏదో కొంత నష్టం కలిగింది. ఆ విషయం తేల్చుకుని ఎంతో విసుగుతో వొచ్చాడు.

రాత్రి అతన్ని సంభాషణల్లో పెట్టింది మధురభాషిణి. అతను ఎంతో ఓపికతో జవాబు లిచ్చాడు. మధురభాషిణి మాటలింకా పూర్తికాలేదు. అతను నిద్రపోసాగాడు. అతన్ని లేపింది.

"ఇదిగో నిద్రపోతున్నారుగా, నా మాట వినరూ."

"వింటాను గాని నిద్రపోదూ, నన్ను చంపక."

"అదుగో, నేనంటేనే విసుగు. నాకు మాటలు రావని ఎన్నాళ్ళు బాధపడ్డారు? ఇప్పుడు మాట్లాడ్డానికే విసుక్కుంటారు. అలాంటి వాళ్ళు నాకెందుకీ వాక్కు వొచ్చేవరకూ బాధ పడ్డారు?"

"బుద్ధి లేక !"

మధురభాషిణికి చెంప దెబ్బ తగిలి నట్టయింది! తర్వాత కొన్నాళ్ళు మౌనంగానే గడిపింది. లోపలున్న అణగారని తీరని కోరిక లోలోపల మధన పెట్టసాగింది. ఆమాట్లాడాలనే తీవ్రమైన వాంఛకు తగిన "అవుట్ లెట్" లేకపోయేటప్పటికి, అది విసుగుగానూ, కోపంగానూ పరివర్తనమైంది.

వంటమనిషి మీదా, దాస దాసీలమీదా మండిపడేది. వాళ్ళు ఆ ధాటికి ఓర్వలేక అసహ్యించుకునేవారు. లోపల-'ఇలాంటి గర్విష్ఠి కనకనే ఆ భగవంతుడలా అన్నాళ్ళు నోరు మూశేశారు' అని అనుకునేవారు.

ఎప్పుడూ చుట్టు ప్రక్కల ఆడవాళ్ళ నందర్నీ పోగుచేసి, వాళ్ళలో కులాసాగా గడుపుతూ, వంటమనిషిచేత టిఫిన్లూ, కాఫీలూ-వేళ కాని వేళల్లో-చేయించుకుని గడిపేది.

ఆ ఆడమళయాళ మంతా మధురభాషిణిమీద ఆపేక్షవల్లగాక ఆ "పచ్చ" దనాన్ని కొంచెం అంటించుకుందామనుకున్నట్టుగా చేరేవారు.

ఒక రోజున వంటమనిషి-ఆరోగ్యం బాగుండక-ఆవిడ చెప్పిన పని చెయ్యలేదు. ఘర్షణ జరిగింది. ఆమనిషి పని మానింది.

సాయంత్రం అంబరీషు వొచ్చాడు. మధురభాషిణి కనపడలేదు. కాఫీ కూడా యెదురవలేదు. అతనికిచాలా చికాకుగావుంది. అసలీమధ్య వేళకు ఇంటికి వచ్చేంత తీరిక లేకండా వున్నాడు. అలాంటిది తీరా నేడేదో సమయం కల్సివొస్తే, చుక్కెదురైనట్టుంది.

"మధురభాషిణీ!" అన్నాడు. తన గదిలోకి వెళ్ళి, గుడ్డలు మార్చుకున్నాక.

మరో నాలుగు నిమిషాల్లో మధురభాషిణి వొచ్చి యెదురుగా నుంచుంది!

"ఏం బుద్ధుండక్కర్లేదు; మగవాడు చచ్చి చెడివొస్తే, కాస్త మంచి నీళ్ళైనా ఇద్దామనే జ్ఞానం లేదా?" కోపంతో అరిచాడు.

మధురభాషిణి ఏమీ మాట్లాడలేదు.

"వంటమనిషేమైంది? కాఫీ అన్నా తేలేదేం?"

"వంటమనిషి ఇంటిముఖం పట్టింది!"

"ఏం?"

"పొగరెక్కి!"

"ఎవరికి?"

ఆ ప్రశ్నకు మధురభాషిణి నివ్వెరబోయింది. కాని ఏమనాలో వెంటనే ఆలోచించిఅంది:"మీరే ఎరుగుదురు!" తిన్నగా తన గదిలోకి పోయింది.

అతను డ్రాయింగు రూంలోకిపోయి పత్రికాపఠనంలో పడ్డాడు. వంటమనిషి వచ్చి ఎదురుగా నుంచుంది. అతను నీడను బట్టి మనిషి రాకను పసిగట్టి, తలెత్తి అన్నాడు: "ఏం, పని మానావుటేం? డబ్బు చేద్దైందా?"

"అది కాదు, బాబూ! నేను మీ యింట్లో పదేళ్ళ నుండి పనిచేస్తున్న దాన్ని. ఎంత జీతానికి కుదిరినా మాకూ అభిమానాలుంటాయి, బాబూ! మహాలక్ష్మి తల్లి! మీ అమ్మగారెప్పుడన్నా నన్ను పల్లెత్తు మాటన్నదా?"

"ఏమంది ఆవిడ?"

"ఎందుకు లెండి బాబూ, ఫిర్యాదు లన్నీ"

ఏదో-ఆవిడ మాటకేంలే! ఈ ఇంటికి యజమానిని నేను-నే చెప్పే వరకూ నిన్ను పనిలోంచి తొలగించరులే; వెళ్లు నీపని చూసుకో, కాస్త కాఫీ పంపు"

వంటమనిషి సణుక్కుంటో వెళ్ళిపోయింది. అతని ఆఖరి మాటలు విని మధురభాషిణి వొచ్చింది. అతను తిరిగి పేపరు చదువసాగేడు. ఐదు నిమిషాల నిశ్శబ్దం!

"అంతలో వుందన్నమాట- ఈ ఇంట్లో నాపెత్తనం" గట్టిగానే సణిగింది.

అతడు గమనించ నట్టూరుకున్నాడు.

భార్యల్ని అంత భారంగా భావించుకునే వారు. ఏ బావిలో నన్ను పారేయకూడదూ?" అంది కఠినంగా.

అతను తలెత్తి చూసి "ఎందుకు వాళ్ళను ఊరికే మాటలనడం?" అన్నాడు.

"నేఅన్నవేగాని, వాళ్ళన్నవి మీకు వినపడవుగావును"

"ఏమన్నారు?"

"నా పొగరుమోతు తనం గ్రహించే దేవుడన్నాళ్ళు మూగగా వుంచాడట!"

"నిజం చెప్పారు-నాకూ అలాగే అనిపిస్తోంది ఈమధ్య!"

ఆ మాట వినేటప్పటికి మధురభాషిణికి కోపముప్పొంగి వొచ్చింది. సోఫాలో కూలబడింది-చిత్తైనట్టుగా.

"నాకు తెల్సు, మీరూ అలాగే అనుకుంటున్నారని, అందుకే నామీద అంత ప్రేమ వొలకబోస్తున్నారు. మీ అందరి బాధా నాకు మాట్లాట్టం వొచ్చిందనేగా! ఆ మాధవరావుగార్ని పిలిపించి మళ్ళీ మూగతనం తిరిగి తెప్పించమని ప్రాధేయపడకూడదూ?" వెక్కి వెక్కి ఏడవసాగింది. అది ఆడవాళ్ళ ఆఖరి ఆయుధం! ముందు ప్రేమతో గెలవడానికి ప్రయత్నిస్తారు!

అది సాగకపోతే ద్వేషిస్తారు; అదీ కుదరకపోతే శోక బాణాన్ని వొదుల్తారు. అదీ వాళ్ళ మనస్తత్వం!

మరో పరిస్థితిలో ఐతే అంబరీషు హృదయం మైనంలా కరిగిపోయేదే! కాని ఈ వేళెందుకో అతని హృదయం గట్టిపడిపోయింది. అతను సంసారిక జీవితాన్ని గురించి ఎన్నో తీయని కలలు గన్నాడు. మొదటి రెండు మూడు సంవత్సరాలు అది ఎండమావి అయింది. తీరా మధురభాషిణి మూగతనం పోయాక, తనెంతో సంతోష పడవచ్చనుకున్నాడు. కాని తల్లి పోవడం, తండ్రి సన్యాసాశ్రమం స్వీకరించడం, తన బాధ్యత అవతల అధికమవడం, మధురభాషిణి అతి వాగుడూ, అన్నీ అతనికి మనశ్శాంతి లేకండా చేశాయి. ప్రేమాదరాలు వెల్లివిరియ వల్సిన దంపతులకు ఎడమొగమూ పెడమొగమూ సంప్రాప్తమైంది.

## 10

"సజాతి ధృవాలు వికర్షిస్తాయి" అన్నట్టు భార్యభర్తలద్దరూ కోపస్వభావులైతే జీవితాలు సుఖమయంగా వుండవు. అవుసరాన్ని బట్టి ఎవరో ఒకరు తగ్గి సర్దుకుపోతుంటేనే జీవితాలు ఒడుదుడుకులు లేకుండా నడుస్తాయి.

తద్విరుద్ధంగా జరుగుతున్న మూలానే వీళ్ళకి శాంతి సౌఖ్యాలు దూరమయ్యాయి.

మొదట వచ్చిన పంతం నాటినుండీ అతనికి అత్తమామల రాకపోకలూ సంబంధాలూ లేకపోయాయి. మధురభాషిణికి అక్కడికి వెళ్ళాలని వున్నా అడగలేకపోయేది. వాళ్ళే మధురభాషిణికి వాక్ప్రసాదం జరిగిం తర్వాత వొచ్చి నాలుగు రోజులున్నారు. మళ్ళా సుందరమ్మగారి మరణం తర్వాత వారం రోజులుండి వెళ్ళిపోయారు.

వంటమనిషి ఇద్దరికీ కాఫీ తెచ్చి ఇచ్చింది మర్నాడు.

ఆనాటికి మధురభాషిణి విషాదపు తెర ఇంకా తొలగలేదు.

"లే, కాఫీ తాగు; పాపం కష్టపడ్డావు" అన్నాడు.

మధురభాషిణి మాట్లాడలేదు. అతనే కాఫీ కలిపి, కప్పూ సాసరూ ఆమె ముందుంచాడు. ఆమె ముట్టలేదు.

"తాగమంటే..."

మధురభాషిణి మౌన భాషిణే అయింది.

"తాగకపోతే నామీద ఒట్టే"

ఏమి జవాబు లేక పోయింది.

"ఐతే నేనూ తాగను సుమా!" బెదరించేడు.

"... ... ... ..."

"నిన్నే! వినపడ్డం లే?"

"... ... ... ..."

అతని కోప మధికమైంది; దగ్గరికి వెళ్లి గట్టిగా గుంజి తాగమన్నాడు.

మధురభాషిణి గుడ్లు ఎఱ్ఱబడి ఎఱ్ఱ విద్యుద్దీపాల్లా వున్నాయి. మౌనంగానే వింది.

"ఇదుగో పారబోసేస్తున్నా" అంటూ వెళ్లి తన కప్పులో కాఫీ బయట పారపోశాడు. ఆమె కదల్లేదు - అప్పటికీ.

"ఇక్కడుండడమే భారంగా వుంటే పుట్టింటికి పోతే సరి!" ఎగతాళిగా అన్నాడు.

"అవును, నేను అదే అనుకుంటున్నాను- మీమనస్సు మారే వరకూ అదే మంచిదేమో" చల్లగా అంటించింది.

అతను ఆశ్చర్యపడ్డాడు. కాని క్షణంలోనే తేరుకున్నాడు. అతనెక్కడో చదివిన విషయాన్ని గుర్తు తెచ్చుకున్నాడు. నవయవ్వనంలో ఉన్న భార్య భర్తలు కొన్నాళ్ళపాటు ఎడబాటుగా ఉండడం వాళ్ళ ప్రేమ నధికం చేయ్యడానికి తోడ్పడుతుందని. ఎదురుగా వున్న వస్తువులెప్పుడూ ఆకర్షకవంతంగా కనపడవు- తెరచిన గుప్పిడిలా; అదే మూస్తే చూసేవాళ్ళ కెంతో కుతూహలం కలుగుతుంది, అందులో ఏదో వుందని.

అందుకని మధురభాషిణిని కొన్నాళ్ళబాటు పుట్టింటికి పంపడమే మంచిదనే భావనే బలపడసాగింది అతనిలో.

"ఐతే సిద్ధంగా వుండు- ఆ సరదా తీర్చుకుందువుగాని" అని దాసీదాన్ని పిల్చి "అమ్మగారి పెట్టే, అదీ సర్దు, వాళ్ళూరు వెడతారు" అన్నాడు. అది లోపలికి వెళ్ళింది.

పనివాణ్ణి పిలిచి "అమ్మగారు రాత్రి బండికి పుట్టింటికి వెడతారు. నువ్వుకూడా వెళ్ళాలి. అక్కడ దిగబెట్టి మళ్ళీ రా" అన్నాడు.

మధురభాషిణి కళ్ళతో అంతా నమ్మలేకండా చూస్తోంది. అదీ మంచిదే అనుకుంది:- ఈ మగవాళ్ళకి ఇంట్లో ఆడది ఆదుకుని వున్నంతకాలం ఏమీలోటు కనపడదు; కొన్నాళ్ళక్కడుంటే ఆయనకే తెల్సి వొస్తుంది- తన అవసరం.

రాత్రి ఎనిమిదిన్నరకి ప్రయాణం, అతను కారులో సామాను పెట్టించాడు. దాసదాసీలు ఈ మార్పుని ఆశ్చర్యంతో చూడసాగేరు. వాళ్లు నాంపల్లి స్టేషనుకు బయలుదేరారు. వాళ్ళిద్దరూ మాటలు పోయిన మిత్రుల్లా మౌనవ్రతావలంబ లయ్యారు. అతను సెకండ్ క్లాసు టికెట్ తీసుకుని రైల్లో ఎక్కించాడు. నౌఖరుకు ఏదో ఆజ్ఞలూ, సలహాలూ, అవి ఇచ్చేడు.

ఆకుపచ్చని సిగ్నల్ కనపడింది. గార్డు ఈల వూదేడు. రైలు కూసి కదిలింది. కోపంతో రగుల్తున్న మధురభాషిణిని హృదయం రైలుతో ప్రయాణిస్తోంది; కాని పశ్చాత్తాపం కూడా మనసులో మారుమూల కలుగ సాగింది.

అతను బయటికొచ్చి నిట్టూర్చాడు. సిగరెట్ ఒకటి తీసి అంటించాడు. టాంగా, రిక్షావాలాల గోల అతని మనస్సుని విపరీతపు టాలోచనల్నుండి మార్చలేకపోయింది.

"ఏమోయ్! అంబరీషూ" అంటూ ఎవరో అతని భుజంమీద చెయ్యి వేశాడు.

అతను సిగరెట్టు మైకం వొదిలి చూశేడు. అయినా ఎవరో గుర్తుపట్టలేకపోయాడు. మాసిన గెడ్డం, చినిగిన చొక్కా, పంచీ, కంఠ స్వరం మాత్రం ఎక్కడో విన్నట్టుంది.

"ఎవరూ?" అన్నాడు.

"నన్నే గుర్తు పట్టలేదూ!"

కళ్ళు పెద్దవి చేసుకుని విద్యుద్దీపాల కాంతిలో చూశేడు. ముక్కూ, మొహం, నల్లశరీరం, అచ్చు అతనే? భరద్వాజ !

"భరద్వాజ్"

"అవునోయ్!"

ఇద్దరూ కౌగలించుకున్నారు. రావోయ్ ఇంటికి పోదాం రా!" అన్నాడు అంబరీషు.

భరద్వాజని బలవంతపర్చి, భోజనం చేసేవరకూ వొదల్లేదు అంబరీషు. కాని మధురభాషిణి కోసం అతని మిత్రుడి కళ్ళు వెతికేయి- శూన్యంగా. అఖరికి అన్నాడు :

"మధురభాషిణేదీ?"

"ఇప్పుడే రైల్లో వెల్లిందోయ్." అంబరీషు తన గాథంతా చెప్పాడు. భరద్వాజ వాళ్లల్లో వొచ్చిన అపార్థాలకు చాలా చింతించాడు.

"మరి నీ గొడవేమిటి? ఇలా సన్యాసిగా అయ్యావేం?" అన్నాడు.

భరద్వాజ తన గాథంతా చెప్పాడు. ఆర్నెల్లయిందిట ఇల్లు విడిచి, బదరీనాథ్ వరకూ యాత్రలు సేవించి వచ్చాడట. ప్రయాగలో పరశురామయ్యగారు వాళ్ల సత్రంలోనే దిగారనీ, కాని ఆయన తనను గుర్తించకపోవడం వల్ల విషయాలేమీ మాట్లాడలేదనీ, హైద్రాబాద్ వొచ్చి రెండు రోజులైందనీ, అతని కోసమే వెతుకుతున్నానని చెప్పాడు.

ఆ ఆకస్మిక కలయికకు ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఇద్దరి వైవాహిక జీవితాలూ అశాంతిదాయకా లైనందుకు విచారించ సాగేరు. ఫ్రెండ్స్ ఇన్ మిజరీ!

(దుఃఖ సముద్రంలో మునిగిన దోస్తులు)

## 11

అంబరీషు భరద్వాజను తన కంపెనీలోనే రెండు వందల రూపాయల జీతంమీద నియమించాడు. తండ్రి వెళ్లిన తర్వాత అతని తోడ్పాటుకి ఎవరూ లేకపోయారు. అనుభవశాలురైన గుమస్తాలు కొందరున్నా, అంత నమ్మకస్తులు కాకపోవడం, దీనికి ప్రోత్సాహమిచ్చింది. అంతేగాక ఎన్నో డక్కాముక్కలు తిన్న తన బాల్య మిత్రునికి ఆ మాత్రం సహాయం చేయడం తన కనీస ధర్మ మనుకున్నాడు.

భరద్వాజ మిత్రుని దయార్ద్ర స్వభావానికి సంతోషించాడు. అతనిచ్చిన పనిని అతి నమ్మకంగా చేసి విశ్వాసపాత్రుడు కాదల్చుకున్నాడు.

వాళ్ళు విద్యార్థి దశలో చేసుకున్న వాదన మర్చిపోనేలేదు- నోరున్న భార్యలతో నెగ్గకపోవడం గురించి.

ముప్ఫైరోజులైంది- మధురభాషిణి వెళ్లిపోయి. అంబరీషుకు ఎంత వద్దనుకున్నా భార్యమీదకు మనసుపోసాగింది.

భరద్వాజకూ భార్య గుర్తుకు రాకపోలేదు- కాని ఇన్ని నెల్ల తిరుగుడుకూ ఎల్లా విశదీకరించాలో తెలీక, తికమకపడి, భార్యని గురించిన ఆలోచనల్ని దూరం చేసుకోసాగేడు.

భార్యల్ని ఏవిధంగా తమ వైపు తిప్పుకోవాలి? వాళ్లని మానసికంగా జయించడమెలా? అనేది ఇద్దరికీ పెద్ద సమస్య అయింది. వాళ్ళ పెద్ద చదువులు దానికి తోడ్పడలేదు.

ఒకనాడు భరద్వాజ కేదో ఆలోచన కలిగి మిత్రుడి చెవిలో వూదాడు. అతని మొహమూ ఆనందంతో వికసించినట్టు మొలకెత్తిన చిరునవ్వు చాటుతోంది.

అవతల మధురభాషిణి పుట్టింటిలో వుందన్న మాటేగాని, ఆత్మశాంతిని కోల్పోయింది. రైల్లోనే కలిగిన పశ్చాత్తాపాగ్ని ఆమె హృదయాన్ని రగల్చసాగింది.

చాలాసార్లు భర్త దగ్గరకు తనంతతానే వెళ్ళిపోవాలనుకుంది. కాని అహం అడ్డొచ్చేది. మనస్సు వెళ్ళమని ఘోషిస్తున్నా, బుద్ధిమాత్రం వెడితే లోకువైపోతావని హెచ్చరించి, భయపెట్టసాగింది.

చివరకు తెగించి, పోలేకపోయింది. వెంకన్నపంతులూ, మాలతమ్మా ఈ గొడవ అర్థం కాక తెల్లబోయేవారు. వాళ్ళకు తన సంగతేమీ చెప్పలేదు.

వాళ్ళేలోటు లేకుండానూ చూస్తున్నప్పటికీ, మధురభాషిణికి ఏదో లోటుగా కన్పించేది. వాళ్ళు తన తమ్ముడ్ని ప్రేమిస్తున్నట్టుగా తనను ప్రేమించడం లేదనుకునేది.

ఒకసారి అత్తారింటికి పోదామనే కోరిక తల్లి దగ్గర వెళ్ళడించింది. మాలతమ్మ "అతనేదో మనసుకుదిరి ఇన్నేళ్ళకు పంపితే నీకేం తొందరొచ్చిందే?" అని గదిమించింది. మధురభాషిణి మళ్ళీ నోరెత్తలేదు.

ఒకరోజున ఏదో టెలిగ్రాం వొచ్చింది- తల్లి కూతుళ్ళిద్దరూ తీరుబడిగా కూచున్న సమయంలో, మాలతమ్మ దాన్ని తీసుకుంది. ఇలా చదివింది. "సన్-ఇన్-లా-సీరియస్ సెండ్ మధురభాషిణి."

ఆ టెలిగ్రాం వినేటప్పటికి మధురభాషిణి దుఃఖసముద్రంలో మునిగినట్టుగా వెక్కి వెక్కి ఏడ్చింది. తల్లి ఓదార్చసాగింది.

సాయంత్రం బండిలో తమ్ముడ్ని తీసుకుని బయలుదేరింది, మధురభాషిణి- తండ్రి ఎక్కడో వ్యాపార రీత్యా దూరంగా పోవడం వల్ల. తల్లి వెళ్ళగానే ఉత్తరం రాయమని మరీ మరీ చెప్పి, స్టేషన్కువొచ్చి, రైలెక్కించింది.

## 12

మర్నాడుదయం అంబరీషు ఇంటి ముందు టాక్సీ ఆగింది. అందులోంచి మధురభాషిణి ఆతృతతో దిగింది. కాని అంబరీషూ, భరద్వాజా కాఫీ తాగుతోండడం చూసి ఆశ్చర్యపోయింది! ఇద్దరికీ నమస్కరించింది– ఏమీతోచక.

నౌకర్లు సామాన్లు లోపల పెట్టారు.

"ఏం దొరసానిగారిలా దయచేశారు? ప్రయాణం సుఖంగా జరిగిందా?" అన్నాడు అంబరీషు.

మధురభాషిణి తమ్ముడు ఇల్లు పరిశీలించడానికి వెళ్ళాడు.

"ఎందుకు ఆ దొంగ టెలిగ్రాంలు?"

"మీ ప్రేమని పరీక్షించడానికే" అంతా నవ్వుకున్నారు.

నౌకరొచ్చి "వీధిలో టాంగా లోంచి ఎవరో అమ్మగారొస్తున్నా రండీ" అన్నాడు.

"మీ దొరసానిగా రోయ్."

"అవుననుకుంటాను,"

"వెళ్ళి, లోపలికి తీసుకురా!" అన్నాడు అంబరీషు భార్యతో. మధురభాషిణి వెళ్లింది. తిరిగి మరు క్షణంలో ప్రభావతితో బాటు వచ్చింది. ప్రభావతి నిండు చూలాల్లా వుంది.

భరద్వాజ తుఫాన్నెదురు చూస్తున్న వాడిలా ముఖంపెట్టాడు. కాని భార్య ముఖం ప్రశాంతంగా వుండడం వల్ల అతని మనస్సు శాంతించింది.

"కులాసాగా రాగలిగావా?" అన్నాడు తనే.

"నిక్షేపం లాగ. మీ టెలిగ్రాంను నేనెప్పుడూనమ్మలేదు" అంది ప్రభావతి.

"ఐతే, మిమ్మల్నీ మోసగించా రన్నమాట!" అని ఆశ్చర్యపోయింది మధురభాషిణి.

"తోడు దొంగలు" అని నవ్వింది ప్రభావతి.

"మీరు తోడికోడళ్ళు గావును" అంబరీషూ నవ్వేడు.

నలుగురూ నవ్వుకున్నారు. ఈ లోపల వంటమనిషి అందరికీ కాఫీ అందించింది.

"ఎలా వుంది నా ఇల్లు?" అడిగింది తమ్ముడ్ని– మధురభాషిణి.

"అదే చూస్తున్నాను" అన్నాడు వాడు.

"నీకు చెముడు పెట్టలేదు కదా దేవుడు, ఒకటి అడుగుతే ఒకటి అంటున్నావు?" అన్నాడు అంబరీషు. అతను కోపంగా చూశాడు. మధురభాషిణి పోలికలున్నాయి కొన్ని.

అందరూ మళ్ళీ నవ్వారు– తోటలో గులాబీ పూలు వికసించి నవ్వుతున్నాయి.

ఆ వేళ ఆదివారం! మిత్రులు భార్యలతో బాటు ఎంతో ఆనందంగా గడిపేరు. ప్రభావతి చాలా మారినట్టుగా స్పష్టమవుతోనే వుంది. ఈ ఏ డెనిమిది నెల్లల్లోనూ చాలా విచారించి వుంటుంది– తను భర్తని పెట్టిన బాధలకు.

భోజనానంతరం శయన మందిరాలను చేరారు.

మధురభాషిణి "నే చేసిన తప్పుల్ని మన్నించరూ" అని భర్తని ప్రార్థించింది.

అంబరీషు "నువ్వేంచేసినా, నా అర్థాంగివి కనక నేనూ చేసినట్టేలే! ఇద్దరమూ పొరబడ్డాం, కొంతవరకూ. ఇక్కడ్నించి చాలా ఆనందంగా గడపాలి" అన్నాడు భార్య జడతో ఆడుకుంటూ.

***

"ఇన్నాళ్ళూ మిమ్మల్ని తల్చుకుని ఎంతేడ్చానని? మీరు కనపడుతారో లేదో, పాపకి ఏం జవాబు చెప్పాలోనని ఎంతో ఏడ్చాను," అంది ప్రభావతి పశ్చాత్తాప హృదయంతో.

"నే నెక్కడున్నా నీవాడ్నే, ప్రభూ" అంటూ ఆమెని సముదాయించ సాగేడు, భరద్వాజ– ఆపేక్షని తెచ్చిపెట్టుకుంటూ.